కథానిక

# అగ్నిగుండం

—కాలువ మల్లయ్య

ఉదయం పదిగంటల సమయం... జీవన సమరంలో పాల్గొనడానికి పల్లెజనాలు ఇండ్లొదలి పొలాల కెళ్ళడానికి తయారవుతున్న వేళ... దప్పు చేతిలో పట్టుకొని కాళ్ళీడ్చుకుంటూ ఇంట్లో కొచ్చాడు అంజయ్య... పొయ్యార్ప బోతున్న బాగామ్మను వద్దని పొయ్యిదగ్గరి కెళ్ళి ముంగాళ్ళపై కూర్చున్నాడు. దప్పు రెండు చేతుల్తో తిప్పుతూ సెగపై కాపుతున్నాడు. కొంతసేపు కాపి చేతితో దప్పుపై కొట్టి చూసాడు. 'టప్... టప్...' మన్న శబ్దమొచ్చింది... "సలి కాలం...సంకల్లేవట్టకుంట సలివేసుతుంది...అట్టిగనే మెత్తవదుతుంది దప్పు." తనలో తాననుకొని మళ్ళీ సెగపై కాపుతున్నాడు.

"గిప్పుడు గా పొయ్యికాడేం జేత్తన్నవు...?" అంపుల కాన్నుంచి వస్తూ అంది బాగమ్మ.

"సలికి మెత్తవడ్డది ...దప్పు కాపుతున్న."

"ఊరు సాటిచ్చచ్చినంక గిప్పుడు గా దప్పుతేనేం పని? తీసి సిలుకొయ్యకు తలిగెయ్యి. కొద్దిగైతె మందంత సేండ్లల్లకు పోతరని పొద్దుగాల్నే పొయ్యి సాటిచ్చిత్తివి. మల్ల కాపు దెందుకు?"

"మెత్త గుండన్నట్లు కాపుతున్న."

"నీ కేమున్న పనున్నదా కని ఊరెందుకు సాటిచ్చినట్టు?"

"నువ్వు కట్టం జేసి పెడితెనేం దినవడితి" నిష్టూరంగ అని "గిరుదవరి సాటత్తండట. రేపు తాసీలు గట్టన్నట"అన్నాడు అంజన్న.

"అయితె మాయెగని బువ్వ తిందవురా. నేను కయికిలి పోవాలె" అంటూ అన్నం గంజు దగ్గరి కెళ్ళింది బాగమ్మ.

నీళ్ళు చల్లి పొయ్యి నార్పేసి లేదాడు అంజయ్య. దప్పును కొట్టి చూసాడు 'టన్-టన్' మని మ్రోగింది. 'దప్పు కాగింది' తనలో తాననుకొని దాన్ని చిలు

క్కొయ్యకు తగిలేసాడు. ఇంటి వెనుక కెళ్ళి కుండల్లోవున్న నీళ్ళతో కాళ్ళు కడుక్కున్నాడు. గుడిసెలో కొచ్చి గొంగడి ముద్దగా వేసుకొని దానిపై కూర్చున్నాడు. ఎర్రగావున్న అసినికార్తి బియ్యపన్నం తెల్లగిన్నెలో వేసుకొని తెచ్చి అంజయ్య ముందుంచింది బాగమ్మ. పచ్చిపులుసు గంజి తెచ్చి ప్రక్కన పెట్టింది.

"అట్టి పులుసేనాయె? ఏం కూర జెయ్యలే?"

"ఇంట్లేమున్నయని సెయ్యాలె? కాల్లెనుపొయ్యే ఈడుకచ్చినా రెక్కాడంది డొక్కాడింది లేపాయె. ఎట్లనో కడుపు నింపుకోలేవు."

"నాల్గుబుక్కలెట్లనో మింగుతుంటియ్యి" అని పులుసుతో కలుపుతున్నాడు.

"సేతికొచ్చిన కొడుకు అందకుండాపాయె ఎవ్వరినన్నేం లాబం? మన రాత. ఆ నారాయణమూర్తికి మనమీద కనికరం లేదాయె." బాగమ్మ కళ్ళనిండా నీళ్ళు.

భార్య కళ్ళలో నీళ్ళు చూసిన అంజయ్య నోట్లోకి ఒక్క పెట్టుకోబోయి ఆగాడు. పాతికేళ్ళ కొడుకాతని కళ్ళముందు కదిలాడు. అతని హృదయం భారమయింది. ముఖంలో విషాదం.

''ఏంది? తినెటోని వాగతివేంది? జెప్పు జెప్పు నాల్గుబుక్కల్దినేదన్న పనికిపో. అది పోతగాండ్లత్తగారింటికి పెయిరి. ఎదిగిన కొడుకును పోలిసోల్లు తన్నుకపెయిరి. కొడుకు దూరమయినప్పటికల్ల పురాగెందు కత్తన్నవు. మన నసీవెట్లుంటె గట్లయితది. ఇగ పుట్టినంక సచ్చేదాకెట్లనో బతుకాలె. ఆద్దిని గంజులున్న దింకింతేసుకొని తిను. నేను ఏ పొలంల నాటేసుడో పటేలవ్వ సడిగత్త.'' కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ బయట కెళ్ళింది బాగమ్మ.

అంజయ్య అన్నం కెలుకుతున్నాడు. కాని ఒక్క బుక్క కూడా నోట్లో పెట్టుకోవడంలేదు. పెట్టుకుంటానికి మనసొప్పడం లేదు కళ్ళవెంట కారుతున్న నీళ్ళు పళ్లెంలో పడుతున్నాయి. ఆతని కళ్ళముందెన్నో దృశ్యాలు. తాను దప్పు కొడుతూ జీవిస్తున్న బ్రతుకు...తిట్లు...అవమానాలు...దెబ్బలు...ఎన్నెన్నో తిరుగుతున్నాయి...

* * *

'డొడ్డొంక దొం-దొడ్డొంక దోం ఇనోళ్లెవలో? ఇనవోళ్లెవలో రేప్పొద్దుగాల ఊళ్లెకు తాసీల్దార త్తండట-తాసీలు గట్టకుంటునోళ్లంత గట్టన్నట. లేకుంటె ఏది దొరుకుతె అది కొంచ వోతరటావో."

"ఇనోళ్లెవలో? ఇనవోళ్లెవలో, ఊళ్లెకు గొడ్ల డాకుటర త్తండట. గొడ్డు గోదకు సూదులే త్తరట. రేప్పొద్దుగాల బడికాడున్న మైదానంలకు గొడ్లన్నిటిన్ని కొట్టుక రావాన్నటాహో."

ఊళ్ళో ఏ అవసరమున్నా సంభై ఏళ్ళుగా తానే ఊరు చాటింపు చేస్తున్నాడు. 'మల్ల తాసీలొచ్చె. పంట పండకున్నా తాసీలయితె తప్పకపాయె. బిందెలో సెంబులో సుంకి రోడెత్తుక పోతంరుసి తన చాటింపును విని మందనుకునే మాట లెన్నోసార్లు విన్నాడు ఊరంతా తిరిగి చాటింపు చేస్తే మొదట్లో తనకు పావలా ఇచ్చేవారు. ఆటుతర్వాత అర్ధరూపాయి, రూపాయి, రెండు, ప్రస్తుతం ఐదురూపాయ లిస్తున్నారు. ఈ వృత్తి కడుపునింపకున్నా అలాగే బ్రతుకుతున్నాడు. డప్పుకొట్టడం లేని సమయాల్లో కూలిపని చేసుకుంటున్నాడు.

"దొం...దొం...దొం...దొం...దొం..." పోచమ్మ డప్పు కొట్టాడు తాను. తాము ఎగురుతూ డప్పు కొడుతుంటే తమ వెనుక శివం తూలుతూ చేతుల్లో వేప మండలతో స్త్రీ లొస్తారు వాళ్ళ వెనుక బోనా లెత్తుకున్న వాళ్ళు. ఊరవతలున్న పోచమ్మ గుడిదాకా డప్పుకొడుతూ ఎగురుతూనే పోవాలి. డప్పు చప్పుడుతో శివం తుచేవాళ్ళకుత్తేజం తేవాలి ఎగురుతూనే తిరిగిరావాలి. కాలాగుతే! తిట్లు... చివాట్లు..

"దొడ్డోం దొం...దొం దొంగొం దొడ్డొంగొం...దొందొండొం... పెళ్ళి డప్పు కొచ్చాడు తాను...దొరల కొడుకుల, బిడ్డల పెళ్ళిళ్ళకు బ్యాండు మేళంతోపాటు తమ డప్పు వాయిద్యం ముంటుంది...పటేండ్ల పెళ్ళిళ్ళకు బీంబాజుతోపాటు తమ డప్పుంటుంది...పేదవాళ్ళ పెళ్ళిళ్ళకు మాత్రం తమ డప్పే అన్నిరకాల వాద్యం...తన డప్పు చప్పుడుతో పెళ్ళి చేసుకున్న వాళ్ళెంతో మంది పెద్దవాళ్ళయ్యారు...ఒక్కొక్కప్పుడు తమ డప్పు మేళం వాళ్ళంతా సవారెడ్ల బండితో సమానంగా పరుగెత్తాలి... చలిలో, ఎండలో ఏ నిముషంలోనైనా పల్లకి, బండ్లతోపాటు తామురకాలి...తాము వెనుకైతే తిట్లు...చీవాట్లు... ఒక్కొక్కప్పుడు దెబ్బలు...అలసిసొలసి పెళ్ళివారూరుచేరితే అక్కడ తాము

వాకిళ్ళలో మాత్రమే వుండాలి. ఇంట్లోకి ప్రవేశంలేదు. వాకిట్లో కూర్చోబెట్టి భోజనం పెడ్తారు. అదీ అందరు తిన్న తర్వాతే! పెళ్ళిఊరేగింపు ముందు రాము గజ్జెలు కట్టుకొని ఎగరాలి. కాళ్ళు నొప్పులు పెట్టినా దప్పు కొడుతూ ఎగరాలి. దప్పాగితే బూతులు... తమకు కూలిగా ముట్టింది చాలా స్వల్పమే.

ఇంకా తాను కాళ్ళగోళ్ళ (శోభనం) దప్పు కొట్టాడు తన దప్పు చప్పుడుతో ఎన్నో జంట లేకమయ్యాయి.

ఊళ్ళో ఏ కార్యమయినా తన దప్పే. ఇదే వృత్తిగా ఇన్నేళ్ళుగా బ్రతుకు తున్నోడు. కాని, తానెన్ని అవమానాలు పొందాడు? ఎన్ని తిట్లు తిన్నాడు? ఎంత ఘర్షణ ననుభవించాడు? ఊరు వాళ్ళంతా తనను రారా పోరా అనే పిలి చారు. అంజిగా అనే పిలిచారు. మాదిగోడా అనే పిలిచారు. పేరు పెట్టి పిల్చిన వాళ్ళు తక్కువ. ఈ వృత్తి తనకు అవమానాలనే మిగిల్చింది. అవమానాల ననుభవించడానికే తాను పుట్టాడా?...

అంజయ్యలో రకరకాల ఘర్షణ కళ్ళవెంట నీళ్ళు. ఒయట్నుంచి ఇంట్లో కొచ్చిన బాగమ్మ భర్త అన్నంలో చేతులుపెట్టుకొని అలాగే ఉండడం, కళ్ళ వెంట నీళ్ళు కార్చడం చూసింది. దగ్గరి కొచ్చింది.

"ఏందియ్యేల్ల సికేమయింది? ఎందుకోసరం గిట్లున్నావు? కొడుకు యాది కచ్చిందా? ఏం జేత్తాం? మన కరుమంగిట్లుంది. ఒక్కబుక్కన్న తిన్లేదేంది? తిను తిను" అని బతిమలాడి అన్నం తినిపించింది. తానుకూడా తిని పన్లోకెళ్ళింది. అన్నం తిని మంచులో పడుకున్నాడు అంజయ్య. లేచి పనికి పోదామనుకున్నాడు. చేతకావడం లేదని అలాగే పడుకున్నాడు. ఎంతకూ నిద్ర రావడంలేదు. వేదనా భరితమై భారమైయున్న అతని మనసు మళ్ళీ గతంలో కెళ్ళింది.

* * *

ఆరోజు... ఆరోజు... రెక్కల కష్టంతో, బండెడు చాకిరీతో బ్రతుకు తున్న తనపై దొంగతనం నేరం మోపాడు వడేలు. చేయని నేరానికి పోలీసుల తోని చావు దెబ్బలు తిన్నాడు తాను. బూట్లుతన్నులు తిన్నాడు. తాను జీవితంలో ఎన్ని పరాభవాలను చూసాడు? ఎంత నీచంగా చూడబడ్డాడు? అంటరానివాడిగా మాదిగోడుగా ఎన్నో అవమానాల పాలయ్యాడు. తానన్ని పనులు చేయాలి. కాని ఇంట్లో కడుగుపెట్టకూడదు. తాను ముట్టిన వస్తువుపై నీళ్ళు చల్లికాని తీసుకోరు.

తనకు క్షవరం చేసే మంగలి గొంగలి కట్టుకుంటాడు. పటేలుతో దెబ్బ తిన్న రోజున తానో నిర్ణయానికొచ్చాడు. తన బ్రతుకెలాగో గడిచిపోతుంది. తన బ్రతుకు తన కొడుక్కు రాకూడదు. తన కొడుకు చదువుకోవాలి. తానెంత కష్టపడైనా సరే తన కొడుకును చదివిస్తాడు. తన కొడుకు చదువుకుంటే వాడన్నా సుఖపడతాడు. తనలాంటి కష్టమయ బ్రతుక్కు దూరంగా వుంటాడు. అని నిర్ణయించుకొని కొడుకును బడికి పంపించడం మొదలుపెట్టాడు. పలకా బలపం పట్టుకొని కొడుకు బడికెళుతుంటే తామెంతో ఉప్పొంగిపోయారు. ఒక్కొ తరగతి పాసవుతూ పై తరగతి కొస్తుంటే తన కష్టాలు గట్టెక్కుతున్నట్టే తలచాడు. హైస్కూల్ సదువుకొచ్చిన కొడుకు జూసి ఎగిరి గంతేశాడు. తాను కన్నకలలకు ప్రతిరూపంగా తన కొడుకు పోకిరీ వేషాలెయ్యకుండా చదువుకున్నందుకు అపరిమితంగా సంతోషించాడు. తానెన్నోసార్లు కొడుకును దగ్గరకు తీసుకొని "బుద్ధిగ సదువుకో బిడ్డ... ఎవ్వల జోలికి పోకు. కాయకష్టం సేసి నిన్ను సద్దివిత్తన్న. నువ్వు సదివినంత సదివిత్తా నా రెక్కలకట్టంతోని. నువ్వయితె మంచిగ సదువుకో.." అన్నాడు.

"నాయినా! నువ్వు నా కోసమెంత కష్టపడుతున్నావో నాకు తెలువదానె! మీరు కోరుకున్నట్టే నేను మంచిగానే సదువుకుంట నా చదువయిపోతే మీకే కష్టాలుండవు." అన్నాడు కొడుకు.

కొడుకు చదువుకోసం తాను, బాగమ్మ రక్తాన్ని నీళ్ళుగా మార్చుకున్నారు. కడవల కొద్దీ ఘర్మజలాన్ని ధారబోశారు. రాత్రింబవళ్ళు విరామం లేకుండా పని చేశారు. కొడుకు హైస్కూలు చదువు పూర్తిచేసిన రోజున తమ సంతోషానికంతులేదు. కాలేజీ చదువు తమకు శక్తికి మించిందే అయినా చదివించడానికే నిర్ణయించుకున్నారు. ఒక్క క్లాసులో కూడా తప్పకుండా బుద్ధిగా చదువుకుంటున్న కొడుకును చదువు మాన్పించాలన్న ఆలోచనే తమకు రాలేదు.

అప్పుడప్పుడే ఊళ్ళలో అలజడి ప్రారంభమయింది. ఎవరెవరో కొత్త వాళ్ళు ఊళ్ళలో కొస్తున్నారు. ఏవేవో రాజకీయాలు చెబుతున్నారు. ఆ మాటకు చాలామంది ఆకర్షితులవుతున్నారు. కూలిరెట్ల పెంపుగూర్చి, పాలేరు జీతాల పెంపు గూర్చి సమ్మెలు, ఆందోళనలు జరుపుతున్నారు... ఊళ్ళలో పోరాటాలు మొదలయ్యాయి. పోలీసులు కొంతమంది యువకులను తీసుకెళ్తున్నారు. తాను

ఇవేవీ పట్టించుకోలేదు. తన ఏకైక ధ్యేయం తన కొడుకును బాగా చదివించి మంచి ఉద్యోగిగా చూడటమే ... కానీ కొడుకు కాలేజీ కెళితే అతనికిలాంటి రాజకీయాలతో సంబంధం ఏర్పడుతుందేమోనన్న భయం తనకొచ్చింది. అందుకే కాలేజీకెళ్తున్నప్పుడు కొడుకుతో చెప్పాడు తాను: "బిడ్డా! నిన్ను మేము ఒళ్ళొ వెట్టి సాదుకున్నం. నీమీదనే ఆశెలన్ని పెట్టుకొని బతుకుతాన్నం. మంచిగ సదువుకో బిడ్డ! ఎవ్వల్తోని తిరుగకు. ఎవ్వలేం జెప్పినా ఇనకు. మమ్ముల గంగల కలుపకు..."

"నాయన్నా! నాకు నువ్వు గిన్నిమాటలు చెప్పన్నాయె! నాకు చదువే ముఖ్యం. నాగురించి మీకేం ఫికరద్దు," అన్నాడు కొడుకు.

ఒక్కొక్క సంవత్సరం చదువు పూర్తి చేస్తుంటే తాను కొండెక్కినంత సంబరపడ్డాడు. మరోదిక్కు ఊళ్ళలో పోరాటాలు ఉధృతమవుతున్నాయి. కాలేజీ పిల్లలనుకూడా పోలీసులరెస్టు చేస్తున్నారని విని తాను భయపడ్డాడు కాని-తన కొడుకెందులోనూ తిరుగడని, అలాంటప్పుడు తనకొడుక్కేం ప్రమాదం లేదని తనకుతాను సమాధానపర్చుకున్నాడు. హాస్టలు విద్యార్థులనూ పోలీసులు తీసుకెళ్తున్నారని విని వణికిపోయాడు. తాను చదువు మాన్పించి ఇంట్లోనే వుండమందామంటే పట్టణాల్లో కంటె పల్లెల్లోనే పోలీసు నిర్బంధ మెక్కువగా వుంది. విద్యార్థులు కొందరు రాజకీయాల్లో తిరుగుతున్నా తనకొడుకు తిరుగడని తన ప్రగాఢ నమ్మకం. చదువుకునే ధ్యేయంగా కల్గిఉంటాడని తన విశ్వాసం. అలాంటివాడి జోలికి పోలీసులు మాత్రం ఎందుకుపోతారని అనుకున్నాడు తాను. తనకొడుక్కేం జరగదు. ...తన కొడుక్కేంజరగదు- తననుతానే సమాధానపరచుకున్నాడు. సెలవుల్లో ఇంటికొచ్చిన కొడుకుతో అన్నాడు తాను: "బిడ్డా! బట్టగాల్చి మీదేసే కాలమిది. అల్ల అంటు సొంటుకు పోకు నీకేమన్నయితే మేం బతుకం."

"నాయన్నా! నేనెట్టి పరిస్థితుల్లోనూ అందులోకి పోను. నాకు చదువే ముఖ్యం. కాని, వాళ్ళు చెప్పే విషయాలూ ఆలోచించ దగ్గవిగానే వున్నాయి. అందరికి తిండి, గుడ్డ, గూడు కావాలనడంలో తప్పులేదు. కాని వాళ్ళ హింసాయుత మార్గమే నాకు నచ్చడంలేదు." అన్నాడు కొడుకు.

ఆ మాటలువిని తాను వణికిపోయాడు.

"అంటే నీకూ్కడా వాళ్ళదిక్కు మనసుపోతుందన్నమాట."

"నాయన్నా మీకా భయమక్కర్లేదు. ఎట్టి పరిస్థితిలోనూ నేను నా ధ్యేయాన్ని మరచిపోను.కాని మనమెంత తెలుసుకోవద్దనుకున్నా ఆ విషయాలు తెలియకుండా వుండవు నాన్నా! యూనివర్శిటీ గోడల్నిండా అవే రాతలు. రోజుకో కరపత్రం. హాస్టల్ గదుల్లో పుస్తకాల్లో ఎంత వద్దనుకున్నా వాటి దిక్కు చూసేలా చేస్తాయి. అయినా నేను వాటిజోలికి పోవడం లేదు.'' అన్నాడు కొడుకు.

మరోసారన్నాడు కొడుకు తనతో: ''నాయన్నా! మన తెలంగాణా ఏరియంతా ఓ అగ్నిగుండమోలె వుంది. ఎక్కడడుగేస్తే ఏమవుతుందోనన్న భయం. ఎప్పటికేదో అలజడి. రకరకాల విద్యార్థి యూనియన్లు. ఒకర్నొకరు చంపుకోవడం, యూనివర్శిటీల్నిండా, కాలేజీల్నిండా, హాస్టల్ గదుల చుట్టూ ఎక్కడ చూసినా పోలీసులే. చదువులు చక్కగా సాగడం లేదు. ఎంత వద్దనుకుంటున్నా. విషయాలు తెలుసుకోకుండా వుండలేకపోతున్నాను."

"ఊళ్ళగూడ గట్లనే ఉన్నయి బిడ్డ. రోజు కొగిన్ని పోలీసోల్లు పట్టుకపోతనే వున్నరు. ఎవ్వలంది నిజమో, ఎవ్వలది అవద్దమో కాని మనుమంత సంపుడయితె బాగలేదు." అన్నాడు తాను.

ఏదో విధంగా చదువు పూర్తిచేస్తే చాలనుకున్నాడు తను.

కొడుకు ఎమ్మే ఆఖరు సంవత్సరం చదువుతున్నాడు ఇంకో ఆరునెలల్లో చదువు పూర్తవుతుంది. కొడుకు చదువు పూర్తయితే తన కష్టాలు గట్టెక్కుతాయని ఆనందించాడు తాను. కొడుకింటికొచ్చినప్పుడే వేవో విషయాలు తనకు చెబుతూనే వున్నాడు. చదువే ముఖ్యోద్దేశ్యంగా సాగిపోతున్నానని చెబుతున్నాడు. బుద్ధిమంతుడైన తన కొడుకును గూర్చి సంబరపడుతున్న సమయంలో హాస్టల్ గదిలో అతన్నరెస్టు చేశారని విని లబలబ మొత్తుకున్నాడు తాను. కంటికో కడివెడుగా ఏడ్చాడు. కొడుకున్న హాస్టల్ గదిలో ఏవో పుస్తకాలు దొరికితే అరెస్టు చేశారని విని ఏడ్చాడు. రెండ్రోజుల తర్వాత విడుదలై వచ్చిన కొడుకును దగ్గరకు తీసుకొని కన్నీరు కార్చాడు.

"నాయన్నా! ఆ పుస్తకాలు నేను తెచ్చినవి కావు. అయినా పుస్తకాలు చదివినంత మాత్రాన ఏం ప్రమాదముందో నాకర్థంగాదు. నాయన్నా! ఒక విధంగా పోలీసులే నాలాంటి ఏం తెలియనివాళ్ళను కూడా అరెస్టుచేసి రాజకీయాలు నేర్చుకోవడానికి దోహదం చేస్తున్నారు. ఏ సంబంధం లేనివాన్ని ఇలా రెండుమూడు సార్లరెస్టుచేసి కొడితే వాడు మొండిగా తయారవుతాడు. అందులో కలిసిపోయినా కలిసిపోతాడు. చాలామంది విషయంలో ఇలా జరుగుతుంది. ఆ పుస్తకాలు మా పక్కరూమతనివి. చదివి మా రూంలో వేశాడు." అరెస్టు కారణాన్ని చెప్పాడు కొడుకు.

''ఏ దెట్లయినా బిడ్డా...! ఇంక నాలుగైదు నెలల్ల నీ సదువయిపోతది. ఇక్కడ బతుకచ్చెటట్టులేదు. ఏడికన్న పొయ్యి బతుకుదాం. నువ్వు నా కండ్ల ముంగలుంటె సాలు బిడ్డ" అన్నాడు తాను.

"నేనేం పట్టించుకోవడంలేదు నాన్నా! కాని ఎవరో చేసిందానికి మరెవరో బలవుతున్నరు. నేను ఏ గొడవ లేకుండా చదువు ముగించుకొనొస్తా" అని వెళ్ళిపోయాడు కొడుకు.

రెన్నెల్లలో పరీక్షలయిపోగానే ఇక కాలేజీకి పోయే అవసరం లేకుండా తిరిగి వస్తున్న కొడుకునుగూర్చి, కొడుకు భవిష్యత్తును గూర్చి ఎన్నో కలలు గన్నాడు తాను. కాని తన కలలు కల్లలయ్యాయి. ఆశలు అడియాసలయ్యాయి. యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి హత్యకేసుతో సంబంధముందని తన కొడుకును అరెస్టు చేశారని విన్న తనపై పిడుగు పడ్డట్టయింది. తాను, బాగామ్మ గొడగొడా ఏడ్చారు. వలవల వలపోశారు. తనకొడుకును విడిపించమని ఎందరి కాళ్ళో పట్టుకున్నారు. కాని ఫలితం శూన్యం. పోగా పోలీసులు తన ఇంటిపై కూడా దాడిచేసి అల్లకల్లోలం సృష్టించారు. తామెంత మొత్తుకున్నా విన్లేదు. చితకబాదారు. కాళ్ళు పట్టుకున్నా విన్లేదు. "మీ మాదిగ మన్నెపోల్లకు అల్లతోని సంబంధముంటది. లేదంటే ఎవ్వల్నమ్ముతార్రా? హత్యసేసినోల్లండ్ల నీ కొడుకున్నడు" అని ఇష్టమున్నట్టు కొట్టారు తమను. తనకా సంబంధం లేకున్నా హత్యానేరంపై ఏడాది పైగా పోలీసు నిర్బంధంలో వున్నాడు కొడుకు. కొడుకు రాకకోసం ఎదురుచూస్తూ జీవచ్ఛవాల్లా బ్రతుకుతున్నారు తాము.

* * *

గతమంతా సినిమా రీళ్ళలా కళ్ళముందు కదలగా అంజయ్య హృదయం భారమయింది. మంచంలో లేచి కూర్చున్నాడు.

'కొడుకెక్కడున్నాడో తెలియదు. అసలు బ్రతికున్నాడో లేదో తెలియదు. కొడుకునేం చేశారో తెలియదు బ్రతికుంటే ఎప్పుడొస్తాడో తెలియదు. ఏం తెలియని కొడుక్కు ఎందుకింత శిక్ష భగవంతుడా?' తనలో తానే భగవంతుని జ్ఞాపకం చేసుకున్నాడు అంజయ్య.


'అసలిదంతా ఎందుకు జరుగుతుంది? కొడుకు చెప్పినట్టుగా తమ ప్రాంత మంతా అగ్నిగుండంలా ఎందుకు మారింది? ఈ అగ్నిగుండంలో ఎంతమంది మసైపోవాలి? అసలెవరిది తప్పు? మింగమంటే కప్పకోపం, విడువమంటే పాముకోపం. సామాన్యుడి బ్రతుకు అడకత్తెరమధ్య పోకలా వుంది. అటు పోలీసుల్నుంచి బాధ. ఇటు ఉద్యమకారుల్నుంచి. తనలాంటివాడికంతా అయోమయంగా వుంది. తనకు తన కొడుక్కావాలి. కాని కొడుకెలా రావాలి?' అంజయ్యలో అంతులేని ఆలోచనా పరంపర

మంచంలోంచి లేచాడు. డప్పు, కట్టె చేతిలోకి తీసుకున్నాడు. 'డం డాం డం...డం...డాం...డం' డప్పుపై విషాదనాదాన్ని పలికిస్తున్నాడు. అతని కళ్ళు వర్షిస్తున్నాయి. హృదయం కొడుకోసం ఘోషిస్తూంది. తన బాధను మరచిపోవడానికి నిస్సహాయంగా డప్పు వాయిస్తున్నాడు. ఈ అగ్ని గుండంలో ఎలా బ్రతకాలో తెలియక వాయిస్తున్నాడు. చేతికెదిగిన కొడుకునెలా తెచ్చుకోవాలో తెలియక నిర్విరామంగా వాయిస్తున్నాడు చేతులు నొప్పెడుతున్నా, కళ్ళవెంట కారుతున్న నీళ్ళు డప్పుపైబడి అది మెత్తబడి టప్టప్ మన్న ధ్వని వస్తున్నా చేతిలో కట్టె విరిగేవరకు డప్పు వాయిస్తూనే ఉన్నాడు అంజయ్య.

## ఈ వారం కథ

# అల్లమురబ్బా

-కాటువ మల్లయ్య



"అల్లమురబ్బా...అల్లమురబ్బా..." బిస్కట్లలా వున్న అల్లమురబ్బా బిళ్ళలను వెదురు బద్దలతో అల్లిన బుట్టలో వేసుకొని అరుస్తూ తిరుగుతున్నాడో కుర్రాడు. ఆ బిళ్ళలు గోధుమ రంగులో నున్నగా వుండి మెరుస్తున్నాయి.

రైలు పరుగెడుతున్నా ఆ అబ్బాయి రైల్లో తిరుగుతూనే వున్నాడు.

"పత్యానికి, పెయ్యి తిరుగుటానికి అల్లమురబ్బా.. తియ్యగా...కారంగా.. అల్లమురబ్బా.. అగ్గువ ... అగ్గువ..." ఒక్కొక్కరి దగ్గరికెళ్ళి అరుస్తున్నాడు.

మెరుస్తూ కనబడుతున్న ఆ బిళ్ళలను చూస్తుంటే ప్రొఫెసర్ విశ్వనాథం నోట్లో నీళ్ళూరుతున్నాయి... తినాలనిపిస్తోంది. ధర కూడా తక్కువే.. కాని, కొనడానికి సంశయిస్తున్నాడు.. చుట్టూ చూసిన అతనికి తన హోదా జ్ఞాపకం వచ్చింది.. సమాజంలో తన కున్న స్థానం జ్ఞాపకం వచ్చింది.. సూటుబూటులో ఎంతో పెద్ద మనిషిలా వున్న తనను అందరూ వెక్కిరిస్తున్నట్టనిపించింది.

'తానేంటి...? అల్లమురబ్బా కొనడమేంటి...?" అనుకున్నాడు.

ఆ అబ్బాయిని పిలవబోయి ఆగిపోయాడు... ముందుకు చాచిన చేయిని వెనక్కు లాక్కున్నాడు.

మూడు బిళ్ళలను చాచిన ప్రొఫెసర్ చేతిలో పెట్టబోయిన ఆ అబ్బాయి అతని వాలకాన్ని చూసి ముఖం చిట్లించాడు. అతన్ని చులకనగా చూశాడు. ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి నిల్చున్నాడు.

"కొందామని కాదు.. నీతో మాట్లాడుదామని.." అన్న ప్రొఫెసర్ మాటలకు మరింత విసుక్కున్నాడా అబ్బాయి.

"కూసే గాడిదొచ్చి మేసే గాడిదను చెడ గొట్టిందట.. ఏంటి సారూ మీరు మాట్లాడేది...?" కోపంగా అన్నాడా అబ్బాయి.

"నువ్వు రోజు కెంత సంపాదిస్తావు...?"

"ఎందుకు సార్... మీకేమన్నా వాటా కావాలా?" కరుకుగా అన్నాడు.

"దీన్నెలా తయారు చేస్తారు...?"

"ఎలా తయారుచేస్తే మీకేంటి..? నేర్చుకొని కంపెనీ పెడతారా? భలే మనిషి దొరికిండు" అంటూ అక్కన్నుంచి వెళ్ళిపోయాడా అబ్బాయి.

ఆ కుర్రాడి మాటల కంతా నవ్వారు.

ప్రొఫెసర్ విశ్వనాథం ముఖం చిన్న బుచ్చుకున్నాడు.

"మీరేం చేస్తుంటారు సార్...?" అతని కెదురుగా కూర్చొనున్న వ్యక్తి అడిగాడు. చెప్పాడు విశ్వనాథం

అతడి మాటలు విని అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు. అతని దిక్కు అదోలా చూశారు. ఆ చూపుల భావాన్ని అర్థం చేసుకున్నాడు విశ్వనాథం.

యూనివర్శిటీ ప్రొఫెసరయిన తనను 'గంజిలో ఈగలా తీసిపారేసిన ఆ అబ్బాయి మాటలు, 'నువ్వో పిచ్చోడి' వన్నట్టు చూస్తున్న తోటి ప్రయాణీకుల చూపులు విశ్వనాథానికి బాధ కల్గించాయి. అతని ముఖంలో ఎన్నో భావాలు సుళ్ళు తిరుగుతున్నాయి.

'అల్లమురబ్బా' జ్ఞాపకాలు అతన్ని వెంటాడుతున్నాయి.

బస్టాండులో కూర్చున్నప్పుడు కాని, బస్సులోనో, ట్రెయిన్‌లోనో ప్రయాణం చేస్తున్నప్పుడు కాని తనకిలాంటి అనుభవాలు ఎదురవుతున్నాయి. రెండు మూడుసార్లు తాను అల్లమురబ్బా కొనాలని పిలవడమో, పిలవబోవడమో జరగడం.. తీరా అతడు దగ్గరకొచ్చేసరికి కొనకపోవడం... అతని దూషణలకు గురి కావడం జరిగింది.

ఓసారి అల్లమురబ్బా అమ్మే కుర్రాడి చేతిలో తాను రూపాయి వుంచాడు. అతడు రెండు బిళ్ళలు ఇవ్వబోతే తాను తీసుకోలేదు. కుర్రాడితో సహా అక్కడున్నవాళ్ళంతా తనని పిచ్చివాడిలా చూశారు. తన అంతర్యాన్ని మాత్రం ఎవరూ అర్థం చేసుకోలేదు.

చాలా కాలంగా తాను అల్లమురబ్బా తినాలనుకుంటున్నాడు. కాని తినలేకపోతున్నాడు. ఇరవై ఏళ్ళుగా తన ఈ చిన్న కోర్కె తీరని కోర్కెలాగే మిగిలిపోతోంది. డైనింగ్ టేబుల్ భోజనం, ఇడ్లీ, వడ, దోస, తిండ్లతో తనకు మొహం మొత్తుతోంది. తన చిన్ననాటి పల్లెటూరి తిండి తినాలనుంది. కాని అదెలా సాధ్యమవుతుంది...? తాను ప్రొఫెసర్. ప్రొఫెసర్ ప్రొఫెసర్‌లాగే తినాలి..?

అల్లమురబ్బా జ్ఞాపకాలాతన్ని గత జీవితం నెమరు వేసుకునేలా చేస్తున్నాయి. విశ్వనాథం మనసు గతంలోకి పరుగెత్తింది.

విశ్వనాథం పేద కుటుంబంలో పుట్టాడు.. చిన్నతనంలో కుడుములు తినేవాడు. పేద కుటుంబాల్లో రాయలసీమ ప్రాంతంలో రాగిసంకటి, కోస్తా ప్రాంతంలో నూకలన్నం భోజనమైనట్టే తెలంగాణా ప్రాంతంలో మొక్కజొన్న గడకన్నం ప్రధానాహారంగా వుండేది. విశ్వనాథం తన బాల్యంలో జొన్న గడుకన్నం తినేవాడు. వేడి వేడి గడుకన్నంలో పెరుగు పోసుకొని పక్కన చింతకాయ చట్నీ నంజుకొంటూ ఎంతో ఇష్టంగా తినేవాడు. అనుములు, మొక్కజొన్నలు, శనిగలతో చేసిన గుగ్గిళ్ళను ఇష్టపూర్తిగా తినేవాడు. చిన్నతనంలో అతనికి వరి అన్నం తినడమంటే మొహం వాచినట్టే వుండేది. పండుగ రోజుల్లో మాత్రం తప్పకుండా వరి అన్నం తినేవాడు.

విశ్వనాథం ఎదుగుతున్న కొద్దీ వాళ్ళ కుటుంబం ఆర్థిక స్థితిలో కొంత కొంత మార్పు రావడం మొదలైంది.

కష్టపడి చదివేవాడు విశ్వనాథం.. అన్ని సబ్జెక్టులలోనూ మెరిట్ మార్కులే. పాఠశాలలో చదివే రోజుల్లో విశ్వనాథం అప్పుడప్పుడు తండ్రితో కలిసి జిల్లా హెడ్ క్వార్టర్ కెళ్ళేవాడు. ఎడ్లబండిపై వ్యవసాయ మార్కెట్ కెళ్ళేవాడు. తండ్రిని అల్లమురబ్బా కొనియ్యమంటే కొనిచ్చేవాడు. మొదట వద్దన్నా దాని ధర తక్కువ కాబట్టి కొడుకు కోరిందే ఆలస్యంగా కొనిచ్చేవాడు. తండ్రి ఒక్కడే వెళితే మాత్రం కొడుక్కోసం 'నిమ్మ పులుసు' పిప్పరమెంట్లు తీసుకొచ్చేవాడు. తండ్రి తెచ్చిన వాటిని ఎంతో ఇష్టంగా చూరిస్తూ తినేవాడు విశ్వనాథం.

మెరిట్ స్కాలర్‌షిప్పుతో చదువుకుంటున్న విశ్వనాథం కాలేజీలో చేరాడు. చదువులో హుషారైన అతని చుట్టూ అనేక మంది మిత్రులు చేరారు. ఓసారి మిత్రులతో కలిసి బస్టాండుకెళ్ళాడు.. మిత్రులెక్కాల్సిన బస్సు కోసం ఎదురు చూస్తున్నారు.

"అల్లమురబ్బా..అల్లమురబ్బా.." కేకేస్తూ వచ్చాడో నడివయస్కుడు. అతన్ని పిలిచాడు విశ్వనాథం.

ధరడిగాడు.

కొనడానికి జేబులోంచి డబ్బులు తీయబోయాడు.

మిత్రులంతా గొల్లున నవ్వారు.

అతన్ని అవహేళన చేస్తూ నవ్వుతున్నారు.

అతన్ని గేలిచేస్తూ, దెప్పుతూ కడుపుచేతిలో పట్టుకొని పడీపడీ నవ్వుతున్నారు.

"ఇంకా గుడాలు (గుగ్గిళ్ళు) బుక్కే బుద్ధి పోనిచ్చుకోలేదు.."

"అరేయ్..మనోనికి మక్క గడుకండి పెడ్దాముర్రా మంచిగుంటది.."

"చదివేది కాలేజీలో.. అల్లమ్మురబ్బా కొనుక్క తింటాడట.."

రకరకాలుగా హేళన చేస్తూ, అతని బాల్యాన్ని గూర్చి నీచంగా మాట్లాడుతూ నవ్వుతున్నారు.

"కాలేజీ పోరగాండ్లు.. అగుతలేరు. మన్ను, మిన్ను తెలుస్తలేదు.." అనుకుంటూ వెళ్ళిపోయాడు అమ్మేవాడు.

మిత్రుల మాటలు, హేళన, నవ్వు చూస్తున్న విశ్వనాథం ముఖం పాలిపోయింది.

ఆ సంఘటన అతని మనసుపై చెరగని ముద్ర వేసింది.

అల్లమురబ్బా ఎప్పుడు కొందామనుకున్నా ఆ సంఘటనే జ్ఞాపకం వచ్చేది.. కొనుక్కోలేక పోయేవాడు.

విశ్వనాథం డిగ్రీ పూర్తయింది. పి.జి. కూడా పూర్తయింది. స్కాలర్‌షిప్పుతోనే డాక్టరేట్ పూర్తిచేశాడు. యూనివర్శిటీలోనే రసాయన శాస్త్రంలో లెక్చరరయ్యాడు. ఈలోగా అతని తల్లిదండ్రులు కాలం చేశారు. నా అనేవాళ్ళెవరూ ఊళ్ళో లేనందున ఊరి కెళ్ళాల్సిన అవసరమూ తప్పింది. అంచెలంచెలుగా ఎదిగి విశ్వనాథం చిన్న వయసులోనే ప్రొఫెసరయ్యాడు.. అతని ఆర్థిక పరిస్థితీ మెరుగుపడింది. ఆర్థిక పరిస్థితితోపాటు అతనిలో కొన్ని కృత్రిమ విలువలూ చోటు చేసుకుంటున్నాయి. మధ్య తరగతి భయాలూ, బిడియం క్రమక్రమంగా అతన్ని ఆక్రమించుకుంటున్నాయి. పెదవులపై నవ్వులు, హాయ్‌లు, హల్లో హల్లోల బతుకలవాటైంది.

బస్టాండులో మిత్రుల సమక్షంలో జరిగిన అవమానంతో 'అల్లమురబ్బా' లాంటివి తనలాంటివాళ్ళు తినేవి కాదన్న భావం అతనిలో పెరుగుతూ వచ్చింది. అది పల్లెటూరి అనాగరికులు చేసేపనిగా భావించడం మొదలైంది. అయినా ఏ మూలో దాన్ని తినాలన్న కోర్కె బలపడుతూనే వుంది.

దానికితోడు పెరిగిన హోదా.. పట్టణపు తిండ్లు. టేబుల్ వడ్డింపులు. నోరంతా రుచీ పచీ లేకుండా అయిపోయింది. నేపుడు కూరలు, నాగరికపు టిఫిన్లతో మొహం మొత్తింది.

ఓసారి భార్యతో బస్సులో ప్రయాణం చేస్తున్నాడు విశ్వనాథం. అమ్మడానికి వచ్చిన అల్లమురబ్బా కుర్రాడ్ని పిలిచాడు.

భార్యతో చివాట్లు తిన్నాడు.

పట్టణపు తిండ్ల మీద మొహం మొత్తిన కొద్దీ విశ్వనాథంలో తన బాల్యంలోని తిండ్లపై కోర్కె పెరగసాగింది. బండ్లపై అమ్మే శనిగ గుగ్గిళ్ళు తినాలని, అల్లమురబ్బా కొనుక్కొని మనసారా తినాలని, కాల్చిన మొక్కజొన్న కంకులు బజార్లో నిల్చొని తినాలని అతని మనసువ్విళ్ళూరేది. కాని బిడియం, ప్రిస్టేజీ అతన్నాపని చేయనివ్వడం లేదు. కానీ చిత్రంగా ఆ కోర్కె అతనిలో బలపడుతోంది..

'చాయ్..చాయ్..' 'కాఫీ..కాఫీ..', బిస్కట్లు.. బిస్కట్లు..' అరుపులతో ఈ లోకంలో కొచ్చాడు విశ్వనాథం. అతని ఆలోచనలకు బ్రేక్ పడింది. ట్రెయిన్ ఓ స్టేషన్లో ఆగి వుంది.

"అల్లమురబ్బా.. అల్లమురబ్బా" అరుస్తూ వచ్చాడో వృద్ధుడు. విశ్వనాథం పక్కనున్న లక్ష్మీరాజం అతన్ని పిలిచాడు.

రెండు రూపాయిలిచ్చి అల్లమురబ్బా కొన్నాడు.

ఏదో అపురూపమైన వస్తువును తింటున్నట్టుగా ఆనందంగా, పరవశం చెందుతూ దాన్ని తింటున్నాడు. ఈ లోకంతోనే సంబంధం లేనట్టుగా తననెవరూ చూస్తున్నారన్న ధ్యాస కూడా లేకుండా పరపరా నములుతూ తింటున్నాడు.

లక్ష్మీరాజం ఎవరో కాదు. విశ్వనాథం పని చేస్తున్న యూనివర్శిటీలోనే పనిచేసే సైకాలజీ ప్రొఫెసర్.. విశ్వనాథం కంటే ఉన్నత స్థితిలో వున్న వ్యక్తి.

నిర్భయంగా, నిస్సంకోచంగా తాదాత్మ్యం చెందుతూ 'అల్లమురబ్బా' తింటున్న డాక్టర్ లక్ష్మీరాజంను నోరు తెరుచుకొని చూస్తున్నాడు విశ్వనాథం... అతని చర్య విశ్వనాథంకు వింతగా వుంది.

తినడం పూర్తిచేసి విశ్వనాథం దిక్కు చూశాడు లక్ష్మీరాజం.

"చాలా సేపట్నుంచి నీ ముఖ కవళికలను చూస్తున్నాను. నీలో జరుగుతున్న సంఘర్షణను చూస్తున్నాను. నీ కంటే ఉన్నత స్థితిలో వున్న నేను ఇలా అల్లమురబ్బా తినడం నీకు ఆశ్చర్యంగా వుంది కదోయ్ విశ్వనాథం.." అన్నాడు ప్రొఫెసర్ లక్ష్మీరాజం.

అవునన్నట్టుగా తలూపాడు డాక్టర్ విశ్వనాథం..

"థియరీ ఆఫ్ రిలేటివిటీ కనుగొన్న మహామేధావి ప్రపంచ ప్రఖ్యాతి వహించిన శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ దగ్గరికో వ్యక్తి వచ్చి ఇలా అన్నాడట. 'మీరు గొప్ప మేధావులు కదా? మనిషి అంతరంగం గురించి గొప్ప రచనలు చేయొచ్చు కదా' అని.. దానికాతడేమన్నాడో తెలుసా..? 'ప్రాణం లేని వస్తువుల గురించైతే పరిశోధన చేస్తున్నాను కాని మనిషి గురించి రాయడం నా మంచి కాదు.. అన్నాడు. ఈ మాటలు మన దేశంలోని మధ్య తరగతి మనిషికి సరిగ్గా సరిపోతాయి.

నువ్వూ నేనూ ఒకే ఆర్థిక స్థితి నుంచొచ్చాం..

మధ్య తగరతి కెదిగాం.. చాలా మందిలోలాగే నీలోనూ మధ్య తరగతి విలువలు, ఫాల్స్ ప్రిస్టేజ్, బిడియం, భయాలు లాంటివి చోటు చేసుకున్నాయి. నేను వాట్ని దగ్గరకు రానీయలేదు. అందువల్ల నేను చేయదలుచుకున్నది నా మనసుకు వచ్చింది ఎవరేమో అనుకుంటారని భయపడకుండా చేసేస్తాను. అటో, ఇటో తేల్చుకునే ఇలాంటి మనస్తత్వం మధ్య తరగతి మనస్తత్వమున్న వాళ్ళలో వుండదు. అదే వుంటే మన దేశ స్వరూపం మరోలా వుండేదేమో...?" అన్నాడు లక్ష్మీరాజం.

అతని మాటల గూర్చే ఆలోచిస్తున్నాడు విశ్వనాథం.. రైలు గమ్యం దిక్కు పరుగులు తీస్తూనే వుంది

# తృప్తి


## కాలువశ్రీ

తన గదిలో కూర్చున్న డా. అశోకరావు కళ్ళ ముందు రామయ్య రూపం కదులుతుంది..."నన్ను బ్రతికించండి డాక్టర్... నన్ను బ్రతికించండి..." అని దీనంగా వేడుకున్న అతని మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. పుట్టిన ప్రతి ప్రాణికి చావు అనివార్యమైనా, డాక్టర్‌గా అతనెన్నో చావులు చూసినా రామయ్య మరణం ఎందుకో అతడు మరచిపోలేక పోతున్నాడు. అతన్ని బ్రతికించడానికి అతడెంతో కృషి చేసాడు...

డాక్టర్‌గా తన వైద్యవిజ్ఞానాన్నంతా ఉపయోగించాడు. తన నర్సింగ్ హోమ్‌లో వున్న డాక్టర్ల సహాయ సహకారాలే కాకుండా, ఆ నగరంలోని మంచి డాక్టర్లందరి సలహాలూ తీసుకున్నాడు. తన శాయశక్తులా ప్రయత్నించాడు. అయినా అతన్ని బ్రతికించలేకపోయాడు. రామయ్య మరణానికాతడంతగా బాధపడటానికి కారణం రామయ్య డా. అశోకరావు తండ్రి కాలం నుంచీ ఆ నర్సింగ్‌హోమ్‌కు రెగ్యులర్‌గా వచ్చే పేషంటవడం ఏ మాత్రం కాదు. ఆ నగరంలో ఎంతో పేరున్న ఆ నర్సింగ్ హోమ్‌కు రామయ్యలాంటి ఎంతో మంది పేషెంట్లు రెగ్యులర్‌గా వస్తూనే వుంటారు. మరాతనిది అకాల మరణమా అంటే అదీ కాదు. తొమ్మిది పదులు దాటిన తర్వాతే మరణించాడు రామయ్య. డాక్టర్ అశోకరావు రామయ్య మరణానికంతగా బాధపడటానికి కారణం అతనికి బ్రతకాలని వున్న ఆరాటం. తొంభై ఏళ్ళుదాటినా బ్రతుకుపై వున్న తీపి... బ్రతకాలి...బ్రతకాలి...తానింకా బ్రతకాలని బ్రతకడానికతడు పడ్డ తపన. ఇంకా బ్రతకాలని చావుతో అతడు చేసిన పోరాటం... మంచంలో వెల్లకిలా పడుకున్నాడు అశోకరావు. అతని కళ్ళ ముందు రామయ్యను గూర్చిన జ్ఞాపకాలు సినిమా రీళ్ళలా తిరుగుతున్నాయి. అతని మనస్సు గతంలోకి పరుగెత్తింది...

*** *** *** *** ***

డాక్టర్ భూంరావు ఆ గదిలోకి ప్రవేశించకుండానే రామయ్య అరుపులను విన్నాడు. అతడు భార్యమీద కేకలేస్తున్నాడు. పిల్లలను తిడుతున్నాడు. ఆ గదిలోకి ప్రవేశిస్తూ అందరి మీదికి లేవడం చూసాడు. డాక్టర్ తన జనంతో గదిలో కొచ్చేసరికి కిక్కురుమనకుండా పడుకున్నాడు. డాక్టర్ భూంరావు నవ్వుకున్నాడు. ఆ నర్సింగ్‌హోంలో చేరిన నాలుగైదు రోజులుగా రామయ్య సంగతి చూస్తూనే వున్నాడు భూంరావు. రామయ్య దగ్గరికెళ్ళి నాడీ పరీక్ష చేసాడు. కడుపు ఒత్తి చూసాడు. కేస్ షీటు చదివాడు. "నిన్నట్నుంచి జ్వరం పెరగడం లేదు..రెండ్రోజుల్లో పంపిస్తాను..." అన్నాడు. "మంచి మందులు రాయండ్రి డాక్టర్..." అన్నాడు రామయ్య.



"మంచివే రాస్తున్నానయ్యా! ఒక్కొక్క గోళీ రూపాయి...ఇంజెక్షన్ పదిహేను రూపాయలు..." మాట్లాడుతూనే కేస్ షీట్‌పై ప్రిస్క్రిప్షన్ రాసాడు డా. భూంరావు.

"సరేకాని రామయ్యా! ఎందుకంత హడావిడి చేస్తున్నావు...అందర్నీ దబాయిస్తున్నావు...?" అన్నాడు భూంరావు...

"నేనంటే ఎవరికీ లక్ష్యంలేదు... నన్ను సరిగ్గా చూసుకోవడంలేదు"రామయ్య మాటలకు నవ్వాడు డాక్టరు...

"నాకు తెలిసినంతవరకు నిన్ను నీ భార్యాపిల్లలు చూసుకుంటున్నట్లుగా ఇంకెవ్వరూ చూసుకోవటంలేదు."

"మీరలాగే అంటారు డాక్టర్..." అని ఆగాడు రామయ్య...

"రామయ్యా! నీకు సమయానికి మందులందిస్తున్నారు....ఏదంటే అది కొనిపెడ్తున్నారు...ఊర్నుండి రోజూ నిన్ను చూడటానికి ఇరవై మందైనా వస్తున్నారు...నీ మీద ఈగకూడా వాలనివ్వడం లేదు..నీకు ఏం కొంచెం నొప్పయినా గబగబా నా దగ్గరికురికొచ్చి తీసుకొస్తున్నారు... నువ్వు పిలువమంటే చాలు, నేను కోప్పడినా నన్ను బ్రతిమిలాడి తీసుకొస్తున్నారు. ఇంకా మంచిగా చూసుకోవటమంటే ఎలా వుంటుంది...?" అన్నాడు డాక్టర్...

"అదిగాదు సార్...అయనను మీరింత జాగ్రత్తగా చూసుకుంటున్నా, మేము కంటి మీద కునుకు లేకుండా చూసుకుంటున్నా తనకేమో అవుతుందని భయం... తాను బ్రతుకుతానో బ్రతుకనో అని ఆరాటం... మీరెన్ని చెప్పిపోయినా నేను బ్రతుకుతానా అని మమ్మల్ని చంపుకుతింటారు..." అంది రామయ్య భార్య...

"రామయ్యా! నీకొచ్చింది పెద్ద రోగమేంకాదు...అందర్నీ పరేషాన్ చెయ్యకు.. నీకొడుకులు, నీ భార్య, నీ కూతురు నీ కోసం ఎంత ఆరాటపడుతున్నారో నాకు తెలుసు...నువ్వు చాలా అదృష్టవంతుడివి..." అన్నాడు డాక్టర్...

"అలాగే సార్..." అని లేచి కూర్చున్నాడు రామయ్య...డాక్టర్ భూంరావ్ ప్రక్కనున్న యువకుడ్ని చూసి

"ఈ బాబెవ్వరు సార్.." అన్నాడు...

"నా కొడుకు...డాక్టర్ కోర్సు చదువుతున్నాడు....సెలవులని ఇంటికొచ్చాడు..." అన్నాడు భూంరావ్.

"అచ్చం మీ తీరుగనే ఉన్నాడు


సార్...మాకు కాబోయే డాక్టరన్నమాట... పేరేంటి సార్...?" అన్నాడు రామయ్య...

"అశోకరావు..."చెప్పాడుభూంరావ్...

భూంరావ్ గది బయటకు పోయే వాడల్లా ఆగి వెనుకకు తిరిగొచ్చాడు.. రామయ్య మంచం దగ్గరున్న స్టూలుపై కూర్చున్నాడు...చిరునవ్వు ముఖంతో అన్నాడు...

"రామయ్యా! నీకు బ్రతకాలనున్న ఆరాటం చూస్తుంటే నీతో కొంచెం సేపు మాట్లాడాలనిపిస్తుంది....నీకిప్పుడెంత వయస్సు..."

"నలభై ఏళ్ళకు దగ్గర్లో వున్నాను..." అన్నాడు రామయ్య-



"నలభై ఏళ్ళు హాయిగా బ్రతికావు.... అనుభవించావు...నీ వంశం నిలుపడానికి పిల్లలున్నారు...అయినా ఇంకేం సాధించాలని బ్రతకాలనుకుంటున్నావు...?"నవ్వుతూ అడిగాడు భూంరావ్...

ఆ మాటల కాశ్చర్యపోయాడు రామయ్య....

"అవేం మాటలు సార్...? నా పిల్లలింకా ఎదుగ లేదు...ఇద్దరు కొడుకులూ చదువుకుంటూనే వున్నారు..ఉన్నొక్క బిడ్డ పెండ్లింకా కాలేదు... నేనిప్పుడే చనిపోతే నా కుటుంబం కుక్కలు చింపిన విస్తరి కాదా సార్...? నా పిల్లలకు దిక్కెవ్వరు...?" అన్నాడు రామయ్య.....

"అంటే నీ పిల్లలను పైకి తీసుకు రావడానికి వాళ్ళకో మార్గం చూపేంత వరకైనా నువ్వు బ్రతకాలంటావు....అంతేనా....?"

"అవును సార్...నా బిడ్డకు పెళ్ళయి, నా కొడుకులు జీవితంలో స్థిరపడ్డారంటే నాకేం కావాలి...? ఇప్పుడు పేంబోతే నా కుటుంబం పిల్లలు దిక్కులేని పక్షులౌతారనే నా ఆరాటం..." అన్నాడు రామయ్య...

"అంటే నీకెన్నేళ్ళు బ్రతకాలనుంది...?"

"అరవై ఏళ్ళు బ్రతికితే చాలు...అటు తర్వాత నేనేమయినా ఫర్వాలేదు..."

"అరవయ్యేళ్ళేం ఖర్మ...నువ్వునూ రేళ్ళు బ్రతుకుతావు..." అని నవ్వుతూ బయటకెళ్ళిపోయాడు డాక్టర్ భూంరావ్...

నాలుగైదు రోజుల తర్వాత సంపూర్ణారోగ్యంతో డాక్టర్ గారికి కృతజ్ఞతలు చెప్పి ఊరెళ్ళిపోయాడు రామయ్య....

దాదాపు రెండు దశాబ్దాల కాలం గడిచింది. డా. భూంరావ్ కొడుకు అశోకరావు డాక్టర్ అశోకరావయ్యాడు.... తండ్రితోపాటు నర్సింగ్ హోం బాధ్యతలు చూసుకుంటున్నాడు...రామయ్య కొడుకులిద్దరూ మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు...కూతురుకు పెళ్ళయి మంచి స్థితిలోనే వుంది...పెద్ద కొడుక్కు-కూతురుకు పిల్లలు కూడా అయ్యారు....రామయ్య అరవై ఏళ్ళ వయసుకు దగ్గర్లో వున్నాడు...తలనెరిసింది...ముఖంపై ముడతలొచ్చాయి. అతనికి భార్యా వియోగం కూడా కల్గింది....ఈ నడుమ రామయ్య చిన్న చిన్న రోగాలకు ఆ నర్సింగ్ హోంలో ట్రీట్‌మెంట్ తీసుకున్నా, ఇరవై ఏళ్ళ తర్వాత-మూత్రం ఆగిపోవడం వల్ల మళ్ళీ అందులో చేరాడు... డాక్టర్ భూంరావ్ కొడుకు సహాయంతో 'ప్రొస్టేట్' ఆపరేషన్ చేసి రామయ్యను ప్రాణాపాయం నుండి కాపాడాడు....నర్సింగ్ హోంలో చేరిన పదిహేను రోజుల్నుంచీ రామయ్యను గమనిస్తున్నారు డాక్టర్ అశోకరావు, భూంరావులు...ఇరవై ఏళ్ళ క్రితం చేరినప్పటి కంటె ఎక్కువ గోల చేస్తున్నాడు రామయ్య....కొడుకులను తిడ్తున్నాడు...కోడళ్ళను కేకలేస్తున్నాడు...బిడ్డను కసురుకుంటున్నాడు..

# తీపి

..మందివ్వడం కొంచెం ఆలస్యమయినా, పాలు అందివ్వడంలో జాప్యం జరిగినా బూతులు తిడుతున్నాడు....పదే పదే డాక్టర్‌ను రమ్మంటున్నాడు.... అతని ప్రాణానికేం ప్రమాదం లేదని చెప్పినా గొడవ చేస్తూనే వున్నాడు.. రామయ్య కొడుకులిద్దరూ సెలవుపెట్టొచ్చి తండ్రితోనే వుంటున్నారు... కూతురు కూడా నర్సింగ్ హోంలోనే వుంటుంది...వాళ్ళంతా అతన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు...వాళ్ళెంత బాగా చూసుకుంటున్నా డాక్టర్ తన గదిలో కొస్తే వాళ్ళపై ఏదో ఫిర్యాదు చేస్తూనే వున్నాడు....

"డాక్టర్...చేతకాని ముసలోణ్ణి నేను చచ్చిపోవాలని వీళ్ళకుంది....నన్ను సరిగ్గా చూసుకోవడం లేదు....నా భార్యుంటే ఇలా జరిగేదా....?"

"రామయ్యా! నీ పిల్లలు నిన్ను బాగానే చూసుకుంటున్నారు. నీకేం లోపం జరిగినా వాళ్ళను మందలిస్తాంలే...." అని సముదాయిస్తున్నారు తండ్రీ కొడుకులు...

మరో పది రోజుల తర్వాత అతని మూత్రనాళంలో అమర్చిన రబ్బరు పైపు తీసేసారు డాక్టర్లు....అతడిప్పుడు మామూలుగా మూత్రం చేస్తున్నాడు....క్రమక్రమంగా కోలుకుంటున్నాడు..కాని, మూత్రం చేసేప్పుడు ఏ కొంచెం నొప్పొచ్చినా, ఎప్పుడోసారి జ్వరం వచ్చినా నానా హడావిడి చేస్తున్నాడు....డాక్టర్లాతన్ని సముదాయించలేక సతమతమవుతున్నారు...

వయసుతోపాటు రామయ్యకు ఇంకా జీవించాలన్న ఆరాటం, బ్రతుకుపై తీపి మరింత పెరిగాయని డాక్టర్లర్థం చేసుకున్నారు...నర్సింగ్ హోంలో వున్న నెల పది రోజుల్లో రామయ్య వాళ్ళకు మరింత దగ్గరయ్యాడు...ఇంకో రెండు రోజుల్లో డిస్చార్జి చేస్తారనగా రామయ్య దగ్గరొచ్చి కూర్చున్నారు తండ్రీ కొడుకులు....

"ఏం రామయ్యా! ఎలావున్నావు...?" అడిగాడు భూంరావ్.

"మీ దయ వల్ల బాగానే వున్నాను సార్...."

"రామయ్యా! ఇరవై ఏళ్ల క్రితం నువ్వేమన్నావో గుర్తుందా?" అన్నాడు భూంరావ్.

"లేదు సార్....ఏమన్నాను....?"

"పిల్లలు స్థిరపడితే చాలు... అందుకోసమే నువ్వు ఇంకా బ్రతకాలనుకుంటున్నానన్నావు...."

కావచ్చు అన్నట్టుగా తలూపాడు రామయ్య...

"ఇప్పుడు నీ పిల్లలంతా స్థిరపడ్డారు.... స్థిరపడటమే కాదు... మంచి స్థితిలో వున్నారు... నువ్వు మనుమలను, మనుమరాండ్రను కూడా చూశావు. ఇప్పుడు నీ పిల్లలకు నీ అవసరం లేదు. అయినా నువ్వు జబ్బు పడితే ఇరవై ఏళ్ల క్రితం కంటె కూడా ఎక్కువ ఆందోళన చెందావు....నీకు ఇంకా బ్రతకాలన్న ఆరాటం, బ్రతుకుపై తీపి మరింత పెరిగాయి..." నవ్వుతూ అన్నాడు భూంరావ్.


"ఎవ్వరికైనా చనిపోవాలనుంటుందా సార్...?"

"నువ్వింకా బ్రతకాలను కోవడంలో నీ ఉద్దేశ్యమేమిటి...? ఏం సాధించాలనుకుంటున్నావు...? నీ లక్ష్యమేంటి?..."

డాక్టర్‌గారి మాటలర్థం కానట్టుగా అయోమయంగా చూశాడు రామయ్య.

"ఎంత వయసొచ్చినా మనిషింకా బ్రతకాలనుకోవడంలో తప్పులేదు...కాని, నీ భార్య చనిపోయింది... దాదాపు నువ్వనుకున్నవన్నీ అయిపోయాయి... ఇంకేం చూడాలని బ్రతకాలనుకుంటున్నావు?..." అన్నాడు భూంరావ్.

"నా చిన్న కొడుక్కింకా పిల్లలు కాలేదు... వాడి పిల్లలను కూడా చూసు



కుంటే నాకు తృప్తిగా వుంటుంది..."

ఆ మాటలకు నవ్వారు డాక్టర్లిద్దరూ...

"అటు తర్వాత నువ్వు బ్రతకాలనుకోవు...అంతేనా....?" అంటూ లేచారు.

"ఏదో సరదాకిలా అడిగాను...ఏమనుకోకు...నీకు బ్రతుకుపై వున్న ఆరాటం చూస్తుంటే ఇలా అడగాలనిపించింది..... అని అక్కణ్నుంచి వెళ్లిపోయారు."

మరో మూడు దశాబ్దాలు కాలగర్భంలో కలిసిపోయాయి...రామయ్య చూడాలనుకున్న చిన్న కొడుకు పిల్లలనూ చూసాడు... తన మనుమలు, మనుమరాండ్రకు పిల్లలనూ చూసాడు... రామయ్య సంతానమే ముసలివాళ్లవుతున్నారు....రామయ్యకు నడుం వంగిపోయి చేతగా కుంటయింది... కర్ర పట్టుకొని అటూ - ఇటూ నడుస్తున్నాడు.... ఇన్నేళ్లుగా రామయ్యకు ట్రీట్ మెంటిచ్చిన డాక్టర్ భూంరావ్ మరణించాడు... అతని కొడుకు నర్సింగ్ హోమ్ బాధ్యతలను తీసుకున్నాడు.... అతడూ వృద్ధుడయ్యాడు.

తొమ్మిది పదుల వయస్సులో తీవ్రమైన జబ్బుతో రామయ్య నర్సింగ్ హోమ్‌లో చేరాడు... ఈసారతని మనుమలు, మనుమల పిల్లలు కూడా వెంబడొచ్చారు..

డాక్టర్ అశోకరావును చూసిన రామయ్య రెండు చేతులెత్తి నమస్కరించాడు. అతని ముఖంలో అభ్యర్థ నుంది...వేదనుంది... బ్రతకాలన్న ఆరాటముంది... బ్రతుకుపై తీపుంది.

"సార్...నేనుబ్రతకాలి...ఎంత డబ్బైనా సరే... నన్ను బ్రతికించండి..." రామయ్య మాటలు బలహీనంగా వున్నాయి.

ఆ మాటల కాశ్చర్యపోయాడు డా. అశోకరావు.

ఇదివరకటి కంటె కూడా రామయ్యకు బ్రతకాలన్న ఆరాటం ఎక్కువయిందని గ్రహించాడు అశోకరావు.

"నా ప్రయత్నం నేను చేస్తాను..." అన్నాడు.

"మా తాతయ్యను బ్రతికించండి" అని మనుమలు, "మా నాన్నను బ్రతికించండి" అని అతని కొడుకులు ప్రాధేయపడుతున్నారు.

"సార్...నేనింకా కొద్ది రోజులు బ్రతకాలి.. నా మునిమనుమలను చూసుకోవాలి... నా మనుమరాలి బిడ్డకు పెళ్లయింది... ఓ ఏడాదిలో నా మనుమరాలు అమ్మమ్మవుతుంది... నే నప్పుడు ముత్తాత నవుతాను... నన్ను బ్రతికించండి సార్..." ఈసారి అడగకుండానే తాను బ్రతకవలసిన అవసరం గూర్చి చెప్పాడు రామయ్య.

## 'టీపు' దర్శకుడిగా శ్రీధర్



ప్రతివారం టి. వి. ప్రేక్షకులకు కనువిందు చేస్తున్న 'ది స్వోర్డ్ ఆఫ్ టిపుసుల్తాన్'కు శ్రీధర్ క్షీర సాగర్ దర్శకత్వ బాధ్యతలు చేపట్టవచ్చునని అనుకుంటున్నారట. మరి శ్రీధర్ 'టిపు'కు దర్శకత్వం వహిస్తే 'మంజిల్' పరిస్థితి ఏమవుతుందో నంటున్నారు. 'టిపు' కాగానే దానికి దర్శకత్వం వహిస్తాడేమో?

"రామయ్యా! నిన్ను బ్రతికించడానికే అన్ని ప్రయత్నాలు చేస్తాము... నా తెలివితేటలు, అనుభవాన్నంతా ఉపయోగిస్తాను... అయినా డాక్టర్లు రోగులకు ప్రాణాలు పోసే దేవుళ్లు కారుగదా....!" అన్నాడు అశోకరావు.

రామయ్యను బ్రతికించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నాడు అశోకరావు. తన పనులు తాను చేసుకోలేని స్థితిలో వున్నా రామయ్య కింకా బ్రతకాలనుండటం ఆతనికి ఆశ్చర్యం కల్గిస్తుంది.. డాక్టర్ రామయ్య గదిలోకి పోయినప్పుడల్లా ఆతన్ని బ్రతిమలాడుతూనే ఉన్నాడు రామయ్య. దీనంగా వేడుకుంటున్నాడు...


"నన్ను బ్రతికించండి సార్...నేను బ్రతకాలి సార్..." అని మాట్లాడటానికి చేతగాకున్నా మాట్లాడుతున్నాడు... రెండు చేతులెత్తి దండం పెడుతున్నాడు... ఎన్నో విధాలుగా వేడుకుంటున్నాడు... డాక్టర్‌గారి కాళ్ళకు మొక్కుతానంటున్నాడు...చచ్చి కడుపులో పుడతానంటున్నాడు... డాక్టర్ అశోకరావు అతనికి ఆపరేషన్ చేశాడు.... తన అనుభవాన్నంతా ఉపయోగించి మంచి ట్రీట్ మెంటిచ్చాడు.. ఎందరో డాక్టర్ల సలహాలు తీసుకున్నాడు.. కాని రామయ్యను బ్రతికించలేకపోయాడు.. ప్రాణాలు విడుస్తూ రామయ్య దీనంగా, వేడుకోలుగా, ప్రాణ భయంతో చూసిన చూపు అశోకరావు హృదయంపై గాఢ ముద్రవేసింది.

మంచంలో లేచి కూర్చున్నాడు అశోకరావు..."ఎంత కాలం బ్రతికినా మనిషి ఇంకా బ్రతకాలని ఎందు కనుకుంటాడు...? జీవితానికే లక్ష్యం లేకున్నా బ్రతకడానికి మనిషికి ఎందు కింత ఆరాటం....? పిల్లలయ్యేంత వరకు పిల్లలు కావాలని... అటు తర్వాత వాళ్లు జీవితంలో స్థిరపడాలని...అటు తర్వాత వాళ్ల పిల్లలను చూడాలని....తర్వాత ఇంకో తరం పిల్లల్ని చూడాలని... ఇలా సాగిపోతూనే వుంటుంది.. ఎంత కాలం బ్రతికినా ఇక చాలు చనిపోతానని ఎవ్వరైనా అనుకుంటారా...? మనస్ఫూర్తిగా మరణాన్ని ఆహ్వానించిన మనిషుంటాడా....? అది మహాత్ములకు, లక్ష్యసాధనకోసం బ్రతికేవాడికి సాధ్యమేమో...? కాని చాలా మంది ఓ లక్ష్యం లేకుండానే, జీవితానికో ధ్యేయమంటూ లేకుండానే కేవలం బ్రతకడాని కొరకే బ్రతుకుతారు...."

డాక్టర్ అశోకరావు మెదడ్లో అంతులేని ఆలోచనలు...

"ప్రతి ప్రాణికి బ్రతుకుపై తీపుంటుంది... బ్రతకాలన్న ఆరాటముంటుంది...? కాని, లక్ష్యం...? తాను మాత్రం ఏ లక్ష్యంకోసం జీవిస్తున్నాడు....? తనను తానే ప్రశ్నించుకున్నాడు....

లేచి కన్సల్టేషన్ రూంలో కెళ్లాడు... రామయ్య డెత్ సర్టిఫికేట్ మీద సంతకం చేస్తున్న డాక్టరు అశోకరావు చేతులు వణుకుతున్నాయి....



# సృష్టికర్త ఆవేదన

డాక్టర్ కాలువ మల్లయ్య

**జన్మదిన కథల పోటీలో తృతీయ**

**తొ**మ్మిది పదుల వయోభారాన్ని మోస్తున్న ఆ వృద్ధుడి పేరు రామయ్య. అయితే గత యాభై ఏళ్లుగా ఆతన్నా పేరుతో ఎవరూ పిలవడంలేదు. ఆతని పేరు 'రామయ్య'ని కూడా ఈతరం వారికి చాలా మందికి తెలియదు. ఊరి వాళ్లంతా అతన్ని 'ముసలయ్య'ని, దొరల కుటుంబాలకు చెందిన వాళ్లు 'ముసలోడ'ని పిలుస్తారు.

ఆతని నడుం వంగిపోయింది. ముఖంలో వయసుతో పాటు, జీవితానుభవపు ముడతలున్నాయి. ఆతని కళ్లో మూడు, నాలుగు తరాల జీవితాన్ని చూసిన జాడలున్నాయి. ఆతని నడుముకో పంచె ఉంది. తల మీద రుమాలుంది. ఒంటిపై ఆతడు పుట్టి బుద్ధెరిగినప్పట్నుండి కూడా అంగీ వేసుకున్న జాడలు లేవు. ఎండ, గాలి, వాన, చలి లాంటివేవీ ఆతని శరీరంపై పెద్దగా ప్రభావాన్ని చూపినట్టు లేవు.

ముసలయ్యకు ఉండటానికో గుడిసుంది. ఆ గుడిసెలోనే ఆతనికి పిల్లలయ్యారు. ఆ పిల్లలకూ పిల్లలయ్యారు. మనుమలతరం వాళ్లకు కూడా పిల్లలవుతున్నారు. ఆ గుడిసె పక్కనే పెద్ద బంగళా ఉంది. ఆ బంగళా స్థానంలో అంతకుముందో మూడిళ్ల భవంతుండేది. అందులో రాజారావు దొర కుటుంబముంటుంది. ముసలయ్య సమకాలికుడైన రాజారావు ఈ మధ్యనే కాలం చేశాడు. ఇప్పుడతని మనుమల కాలం నడుస్తోంది.


ఆ ఊళ్లో జమీందారైన రాజారావు కుటుంబం బంగళా పక్కన ముసలయ్య కుటుంబం వాళ్ల గుడిసె ఉండడం అసహజమే. దొరలుండనీయరు కూడా. ముసలయ్య పసివాడుగా ఉన్న సమయంలో రాజారావు తండ్రి ముసలయ్య తండ్రిని తన ఇంటి సమీపంలో గుడిసె వేసుకొమ్మన్నాడు. ముసలయ్య వాళ్ల కుటుంబమంతా రాజారావింట్లో పనిచేస్తూ బతికేవారు. ఇంట్లోంచి కేకేస్తే చాలు ఎవరైనా పరుగెత్తుకొచ్చేవారు. ఆ విధంగా ముసలయ్య కుటుంబమక్కడ స్థిరపడిపోయింది. అక్కడి నుంచి ముసలయ్య కుటుంబాన్నెప్పుడో తరిమేసే వారే కాని వాళ్లతో దొర కుటుంబాని కవసరముంది. అందుకే వాళ్ల జోలికి పోలేదు. అటు తర్వాత వాళ్లు పొమ్మన్నా వీళ్లు పోదలుచుకోలేదు.

దొర, ముసలయ్య ఇండ్ల మధ్యనున్న ప్రహరీ గోడవతల దొర భాగంలో పెద్ద చింత చెట్టుంది. దాని కొమ్మలు మాత్రం ముసలయ్య వాకిట్లోకున్నాయి. అన్ని కాలాల్లో ముసలయ్య వాకిలంతా చింతాకుతో నిండి వుంటుంది. ఆకురాలు కాలంలోనైతే మరీ ఇబ్బందిగా ఉంటుంది. వాకిల్నిండా చింతాకే. ఎన్నిసార్లూడ్చినా ఊడ్చినట్టే ఉండదు. పైగా ధాన్యం ఎండపోసుకుంటే దాన్నిండా చింతాకు పడుతుంది. నీడవల్ల అది ఎండడం కష్టంగానే ఉంటుంది. ఆ చెట్టు వల్ల వాళ్ల కిబ్బందిగానే ఉంది. దాన్ని గురించే ఇదివరకెన్నోసార్లు తగాదాలు కూడా అయ్యాయి.

వాకిట్లో వాల్చున్న నులకమంచంలో వెల్లకిలా పడుకోనున్నాడు ముసలయ్య. జడల దయ్యంలా ఉన్న చింత చెట్టును చూశాడు. ఆతని కళ్ల ముందెన్నో జ్ఞాపకాలు తిరుగుతున్నాయి.

చింతచెట్టు గూర్చి దొర కుటుంబంతో తగాదాలు పెట్టుకోవద్దన్నాడు ముసలయ్య. కాని ఆతని మనుమలు వినడంలేదు. "దొర లేడు.. దాత లేడు.. ఎవడు ఎవడికి దొర? చెత్తంతా ఎత్తిపోసేది మేము కాయంతేమో దొరకా? సగం కాయ మాకు రావాల్సిందే. ఆకు మాకు, కాయ దొరకా?" అన్నారు ముసలయ్య మనుమలు. ముసలయ్య వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయాడు.

ఈ విషయంలో మనుమలు చెప్పిన చిన్న కథ జ్ఞాపకం వచ్చింది ముసలయ్యకు. పొత్తులో ఉన్న భూమి విషయంలో ఇద్దరికి తగాదా వచ్చింది. అందులో ఒకడు తెలివైనవాడు. రెండవ వాడమాయకుడు. పంటలో పై భాగం నీది, కింది భాగం



నాది అన్నాడు తెలివికలవాడు. సరే నన్నాడు రెండవవాడు. వేరుసెనగ పంట వేశారు. ఆకు అమాయకుడికి, కింది భాగంలోని కాయ తెలివికలవాడి కొచ్చాయి. ఈ సారి నాకే కింది భాగమన్నాడు అమాయకుడు. చేలో కంది పంట వేశారు. పైనున్న కంది వాడికి కిందున్న కట్టె అమాయకుడి కొచ్చాయి. ఈ కథలోని తెలివికల వాడిలాంటివాడు దొర.

ఆలోచిస్తే మనుమలు చెప్పిందీ నిజమేననిపిస్తుంది ముసలయ్యకు.

ముసలయ్యకు చికాకుగా ఉంది. ఆందోళనగానూ ఉంది. అతని తొమ్మిది పదుల జీవితానుభవం దొరలాంటి బలవంతులతో తగాదాలు పెట్టుకోవద్దని చెబుతూంది. ఫలితాలేంటో ఆతనికి గుర్తుకొస్తున్నాయి. అయినా ఆతని మనుమలు వినడంలేదు. చింతకాయ

## బహుమతి 2,000/- గెలుచుకున్న కథ



**తృతీయ బహుమతి రు.2,000/- పొందిన 'సృష్టికర్త ఆవేదన' కథా రచయిత డా. కాలువ మల్లయ్య**

జననం - 12-1-53న కరీంనగర్ జిల్లాలోని తెలుకుంట అనే మారుమూల గ్రామంలో, దిగువ మధ్యతరగతి కుటుంబంలో. చదువు - బి.ఎస్.సి బి.ఇడి., ఏ.ఐ.సి., పి.జి.డి.పి.ఆర్., ఎం.ఏ., పిహెచ్.డి.. ఉద్యోగం - ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, రామగుండంలో సీనియర్ కెమిస్ట్.

శ్రీమతి విజయలక్ష్మి. ఇద్దరు చిన్నారులు.

అభ్యుదయ సాహిత్యానికి సామాజిక ప్రయోజన ముండాలని, సామాజికమైన మార్పులో సాహిత్యం పాత్ర కొంతైనా ఉంటుందని నమ్ముతున్నవాణ్ని. తెలంగాణా గ్రామీణ జీవితం నేపథ్యంగా రచనలు చేస్తున్నాను. గ్రామాల్లో మారుతున్న విలువలను, జరుగుతున్న సంఘర్షణను, కలుగుతున్న సంక్షోభాన్ని పతనమవుతున్న వృత్తులను, ఉద్యమాలను అక్షరబద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నాను. సాహిత్యం జీవితంలోంచి రావాలన్న ధ్యేయంతో ఉత్తమ సాహిత్య సృజనమే ఏకైక జీవిత దృక్పథంగా రచనలు చేస్తున్నాను.

1983లో రాయడం ప్రారంభించి, రెండువందలకు పైగా కథలు, పాతిక సాహిత్య వ్యాసాలు, ఒక నవల, 'అవ్వతోడు గిది తెలంగాణ' పేరుతో ఆదివారం 'ఆంధ్రప్రభ'లో వచ్చిన శీర్షికా రచనలు, కొన్ని కవితలు రాశాను. కవితలు, కథలు కలిపి అయిదు పుస్తకాలు సంకలనాలుగా వచ్చాయి.

కొడవటిగంటి, కాళీపట్నం, రా.వి. శాస్త్రి నా అభిమాన రచయితలు. మానవ జీవితంలోని సంఘర్షణను చిత్రిస్తూ జీవిత వాస్తవికతను చిత్రించే ఏ రచనైనా నా అభిమాన రచనే!

డా. కాలువ మల్లయ్య 3-37, ఫెర్టిలైజర్ సిటీ, కరీంనగర్ జిల్లా - 505 210.

లో సగం తమకు రావాల్సిందే నంటున్నారు. ఇటీవలి కాలంలో ఊళ్లో జరుగుతున్న, జరిగిన మార్పులను జ్ఞాపకం చేసుకున్నాడు. ముసలయ్య లాంటి వారికవి ఆశాజనకంగానే కనబడుతున్నాయి. ఏదేమైనా దొర కుటుంబానికి లొంగేది లేదన్న మనుమలవాదం గూర్చి ఆలోచిస్తున్నాడు ముసలయ్య.

ఇదివరకెన్నోసార్లు జరిగినా పరిష్కారంకాని చింత చెట్టు గూర్చి పంచాయతీ రేపు జరుగబోతుంది. ఆ పంచాయతీ గూర్చే ఆలోచిస్తూ నిద్రలో కొరిగాడు ముసలయ్య.

తెల్లవారింది. బారెడు పొద్దెక్కి . ఊరి పెద్ద మనుషులంతా రాజారావు దొర కొడుకు రాఘవరావు ఇంటి ముందు గుమిగూడుతున్నారు. చింతచెట్టుకిందే పంచాయతీ రాఘవరావు కొడుకులు కిషన్‌రావు, శ్యాంరావు మిత్రులతో కలిసున్నారు. ముసలయ్య మనుమలు సురేష్, రాజు నూనూగు మీసాల నూత్న యవ్వనంలో కోడెల్లా ఉన్నారు. వాళ్ల వెంట వాళ్ల స్నేహితులున్నారు. ముసలయ్య కట్టె చేతితో పట్టుకుని ఆయాసంగా నడుస్తూ అక్కడి కొచ్చి కూర్చున్నాడు. పెద్ద మనుషులంతా బల్లలపై, మంచాలపై కూర్చున్నారు. ఆ పంచాయతీ చూడటానికి చాలా మంది ఊరి వాళ్లొచ్చారు.

ఆకురాలు కాలం. చింతాకు వాళ్ల మీద తుంపరపడ్డట్టుగా పడుతూనే ఉంది.

సర్పంచి అందరి దిక్కూ చూశాడు. సరాయించాడు.

"ఈ చింతచెట్టు కొట్లాట చాలా రోజుల్నుంచి నానుతూంది. దీన్నిట్లానే విడిచిపెడితే బాగుండదు. ఈ రోజు ఏదో పరిష్కారం అయిపోవాలి. నాన్చుకుంటూ పోతే కక్షలు పెరుగుతాయి" అన్నాడు.

"అవును. అవును." అన్నారందరు.

"ముసలయ్యా! నువ్వు కష్టాల జూసినవు. సుఖాలం జూసినవు. మూడు తంతెల(తరాల) మనుషులం జూస్తున్నవు. నీ మనుమలేమొ ఉరుకులాడుతున్నారు. చింతకాయలో సగం కావాలంటున్నారు. లేకుంటే కొట్టేసుకొమ్మంటున్నరు. చెట్టుందేమో రాఘవరావు వాకిట్లో. కొమ్మలన్నేమొ మీ వాకిట్లున్నయి. నువ్వేమంటవో చెప్పు." అన్నాడు సర్పంచ్.

ముసలయ్య లేచి నిల్చున్నాడు. అందర్నోసారి కలియజూశాడు. రుమాలు తీసి కిందపెట్టి తల బరుక్కున్నాడు.

"అయ్యలారా! మీరంత పెద్ద లోకులు. మీకు చెప్పెటోన్నిగాదు నేను. మీరన్నట్టు నేను మూడు తంతెల మనుషుల జూసిన. రాఘవరావు దొరను నేను ఎత్తుకున్న. భుజాల మీద మోసిన. నా చేతులల్ల పెరిగిండాయినె. మూతి కడిగిన. వాళ్లింట్ల అరొక్క పని జేసిన. నా బతుకంత ఆల్లింట్లనే గడిచింది. ఆయన కొడుకులకు గూడ సేవ జేసిన.


"నాకు రాజారావు దొర యజమానైతె నా కొడుక్కు రాఘవరావు దొర యజమానైండు. మా కుటుంబమంత వాళ్ల సేవల్నే బతికినం. ఈ బంగ్ల పక్కన మా గుడిసెనుండనిచ్చింది మా మీద ప్రేమతోని గాదు. నాత్తిరి పగలు ఆల్ల సేవకు మేం పనికత్తమని" ఆగాడు ముసలయ్య.

ఆ మాటల్నందరూ శ్రద్ధగా వింటున్నారు.

"నీ యవ్వ! ముసల్దోనికినా పారేత్తు. గీ సోదంత ఎందుకు? అసలు సంగతేందో చెప్పలేవు" అన్నాడో పెద్ద మనిషి.

"అయ్యాలార! ఇది మీకు సోదోలె కనపడుతుందేమొ? కాని ఇవన్ని చెప్పింది ఈ పంచాయతి సంగతి మీకు పూర్తిగ తెలువది. నేను చెప్పే సంగతులు ఒకదానితోని ఇంకోదానికి సంబందముంటది. పోతె ఇది మామూలు చింతచెట్టు పంచాయతిగాదు. గందులో ఎన్నో విషయాలున్నయి." అన్నాడు ముసలయ్య.

"సరే కానియ్యి! నువ్వు చెప్పేది చెప్పు." అన్నాడు మాజీ పట్వారి.



"అయ్యలార! దొర సంతోషమే మా సంతోష మనుకున్నం.

"అల్లకే సేవ జేసినం. కొడితె పడ్డం. తిడితె పడ్డం. ఒక్కమాటన్లేదు. అసలు మేం నోరే తెరువలేదు."

"వట్టిగనే పని జేసిండ్రా? మీకు కూడుబెట్టలేదా?" శ్యాంరావు మాటలకు విరాగిలా నవ్వాడు ముసలయ్య.

"కూడు పెట్టిండ్రు నిజమే. మా కుటుంబమంత దొర సేవలోనే గడుపుతె మాకేం దక్కింది? ఇగో గీ బొక్కలు, గీ చింపుల పేగులు. మేమేం బంగ్లాలు గట్టినమా? భవంతులు గట్టినమా? భూమి జాగలు కొన్నమా? జానెడు పొట్ట నింపుకొనుడే గగనమైంది. మేం మా తండ్రి కాలం నుంచి గూడ గిదే గుడిసెలుంటున్నం. ఈ గుడిసెల్నే మా అందరి బతుకులెల్లి పోతన్నయి. మరి మేం సేవ చేసిన దొర? ఇప్పుడున్న బంగ్లా అడుగున మునుపు భవంతుండేది. గూనిల్లుపోయది బంగ్లా అయింది. దొరకింకా పట్నంల బంగ్లాలున్నయి. ఆస్తులున్నాయి. నాకు, నా మనుమలకు అప్పటికి, ఇప్పటికి గుడిసే మిగిలింది. గీ రెక్కలే మిగిల్నయి. ఇగో గీ రెక్కలే మిగిల్నయి దొర. సేవ జేసి సంపాయించింది ఇది...." తన ముదుసలి శరీరాన్ని చూపుతూ అన్నాడు ముసలయ్య.

"అల్ల మోచేతి కింద నీల్లు తాక్కుంట బతికి అదో బతుకని చెప్పుతున్నవా? అది గూడ బతుకేనా?" అన్నాడు సురేష్.


"అదుగో చూడుండ్రి. నా మనుమలు. నాదో బతుకే కాదంటండ్రు. కాలం మునుపటి తీరుగ లేదు. ఇప్పుడు దొర అనటానికి కూడ వాల్లిష్టపడుతలేరు. ఇప్పటోల్లకు పౌరుష మెక్కువ. ఇప్పుడు పడు సోల్లదే కాలం" అన్నాడు ముసలయ్య.

"ఇంతవరకు చెప్పిన చరిత్ర చాలు. ఇప్పుడు చింతచెట్టు సంగతేంటో చెప్పు" అన్నాడు మరో పెద్దమనిషి.

"చెట్టు గురించి మీకు తెలువందేముంది? దీని పంచాయతి ఏండ్ల నుంచి నానుతున్నదేనాయె. మీ దాంట్ల దొరలున్నరు. పటేండ్లున్నరు. చదువు కున్నోల్లున్నరు. నేం జెప్పేది బాగ మనుసున పెట్టుండ్రి. ఈ చింతచెట్టుని నా చేతుల్తోని నేనే పెట్టిన. నీల్లు పోసిన. గొర్రె, మ్యాక, గొడ్డు గోద మేయకుండ కాపాడిన. దీన్ని నేనే సాదిన. సవరక్షణ చేసిన. పెంచి పెద్ద జేసిన. మునుపు పరారి గోడలు లేకుండె. గీ హద్దులు లేకుండె. కొన్నేండ్లయిన తర్వాత ప్రహరి గోడలచ్చినయి. చెట్టు మొదలేమొ దొర గోడ పక్కకుంది. మొత్తం చెట్టు కొమ్మలన్నీ మా వాకిట్లకున్నయి.

"చెట్టు కాపుకొచ్చింది. నా కాలంల దొర కెదురుమాట్లాడెరుగ. చింతకాయ మా వాకిట్ల రాలిందంతా దొర మనుషులు, స్వయంగా నేను దొర ఇంట్లో వేసేటోల్లం. దొర దయతలచి ఇస్తే ఒకటి రెండు కాయలు తీసుకునెటోల్లం. లేకుంటే లేదు. కావన్నని మేమెప్పు డడగలే. అటెనుక నా కొడుకు కాలమచ్చింది. వాని కాలంల ఆకంత మన వాకిట్ల పడితే కాయ మనకేం రాదా అన్న ప్రశ్న వచ్చింది. ఆ మాటల విని రాఘవరావు దొర కోపానికొచ్చిండు. అదంతల్నే అయిపోయినది. నా కొడుకు కాలంల దొర అప్పుడప్పుడు పులుసు కోసం కొంత చింత పండిచ్చెటోడు. నా కొడుకిప్పుడు లేడు. రెండేండ్ల కిందనే చనిపోయిండు.

"ఇప్పుడు నా మనుమల కాలం నడుత్తుంది. నా మనుమలు మా వాకిట్లో పడ్డ కాయల్లో సగం మాకే రావాలంటున్నరు. ఒకలిచ్చేదేంటి? అది మాదే నంటండ్రు. చెత్తంతా ఎత్తపోసేది మేము.




కాయేమో దొరకా అని నిలదీస్తండ్రు. ఇన్ని రోజులెట్లనే గడిచింది. మాది ఎడ్డికాలం. ఇప్పుడైతె నా మనుమలు చెప్పింది నాకు రైటె అనిపిత్తంది."

ముసలయ్య చెప్పిన మాటలన్నీ విన్నారు పెద్ద మనుషులు. వాళ్ళల్లో వాళ్లు మాట్లాడుకుంటున్నారు.

"చెట్టు దొర వాకిట్ల ఉంది కదా! కాయ నీ కెట్లా వస్తుంది?" అన్నాడు సర్పంచ్.

"నిజమే. చెట్టు మొదలు దొర భూమిల్నే ఉంది. కాని కొమ్మలన్ని మా ఇంటి మీదున్నాయి. ఆకంత మా గుడిసె మీద రాల్తది. వాకిట్ల ఎండుగులు నేర్పినట్టు రాల్తది. చెట్టు నీడతోని వాకిట్ల ఏదెండ బోసుకున్నా ఎండది. చలికాలంల ఎండ పొడక్కూసుందామన్నా ఎండెల్లది. ఇగేం జేసుడు? చెత్తంత ఎత్తిపోయాలె మేం? కాయల్నేమొ పాలు లేదా అంటున్నరు నా మనుమలు. మేం మొత్తం కాయ మాకే కావాలంట లేము. మా వాకిట్లో పడ్డదాంట్ల నుంచి సగం ఇయ్యమంటున్నం. ఇదేమన్న అన్యాయమా చెప్పుండ్రి? యాడాదంత చెట్టుతోని కష్టపడి భాగం కోరుడు తప్పా?

"పోగా, ఆ చెట్టుని పెట్టి, సాది, సవరక్షణ చేసింది నేను. బుద్దుని కథ చెప్పిండు నా మనుమడు. పక్షిని చంపాలనుకున్నోని కంటె పక్షిని కాపాడినోనికే దాని మీద హక్కుంటది. అట్ల జూచినా చెట్టు మీద నా కధికార మున్నది." అన్నాడు ముసలయ్య.

"ముసలోడు సూడురో.... కథలు గూడ చెప్పు తండు.."

"దొరలంటె ఎంత భయపడెటోడు .. ఇప్పుడెట్ల మాట్లాడతండు ముసలోడు."

"మనుమలు బాగ నూరి పోసిండ్రు."

"ముసలోని మాటల్లో కూడ తప్పేముంది?"

రకరకాలుగా మాట్లాడుకుంటున్నారు జనాలు.

"మీకు బాగా కావురాలచ్చినయి. ఎవరెవరిదో బలం చూసుకొని చింగి బింగాడు తండ్రు. చెంగు చెంగనెగురు తండ్రు." కోపంగా అన్నాడు శ్యాంరావు స్నేహితుడు.

"ఇందులో తప్పేముంది? మీది నడిసినప్పుడు మీరు నడిపిచ్చుకోలేదా? మా రెక్కల కష్టంతోని మేము బతుకుతున్నం. మీ కెందుకు లొంగుండాలె?" అన్నాడు రాజు.

ఊళ్లో తమ కుటుంబం లాంటి వాళ్లది తమ చిన్నతనంలో సాగినట్లుగా సాగకపోవడం రాఘవరావు కొడుకులకు మంటగా ఉంది. కూలినాలి చేసుకునే వాళ్లు కూడా ఎదురు మాట్లాడటం కోపంగా ఉంది.

"మా మోచేతి కింది నీల్లు తాగి బతికినోల్లు కూడా ఈ రోజు మాట్లాడేటోల్లయిండ్రు. గుడిసెను కూడ ఇడిసిపెట్టి వెళ్లిపొండ్రి. దాని ధరిత్తం. ఎప్పటికి కిరికిరెందుకు?" అన్నాడు కిషన్‌రావు కోపంగా.

"ఇల్లు విడిచిపెట్టి, ఊరు విడిచిపెట్టి మేమెందుకు పోతం. పోతే గీతే మీరే పోతరు. ఊళ్లల్ల ఎంతమందిని

చూస్తలేం?" అన్నాడు సురేష్ వ్యంగ్యంగా.

"ఏమన్నార్ర...." లేవబోయారు రాఘవరావు కొడుకులు.

ముసలయ్య మనుమలూ పైకురకబోయారు. అక్కడున్న పెద్ద మనుషులు వాళ్ల నాపారు.

"ఇలా ఉంది వ్యవహారం. మీరేమంటారో చెప్పండి రాఘవరావు గారూ." అన్నాడు మాజీ పోలీసు పటేలు.

రాఘవరావుకు తన కళ్లముందే తన లాంటి వాళ్ల అధికారం క్రమక్రమంగా కూలిపోవడం జ్ఞాపకం వచ్చి హృదయం భారమైంది. తన తండ్రి కాలంలో ఎంతో వైభవంగా సాగింది. తన కాలంలోనూ చాలా వరకు సాగింది. కాని కొన్నేళ్లుగా తమ అధికారానికి బీటలువారడం మొదలై ఇప్పుడది పరాకాష్ఠకు చేరుకుంది. తనను ఎత్తుకొని పెంచిన ముసలయ్య లాంటి వాళ్లు కూడా ఇప్పుడు తమ లాంటి వాళ్ల మాటలు వినడంలేదు. విందామన్నా యువకులు విననివ్వడంలేదు. ఈ చింతచెట్టు వ్యవహారంలో తాము, ముసలయ్య వాళ్లు ఎవరి పట్టు మీద వాళ్లున్నారు. ఇది తమ లాంటి వాళ్లకో లెక్కకాదు. దీన్ని వదిలిపెట్టవచ్చు. కాని, అలా చేస్తే తాము అలగాజనం ముందు వీగిపోయినట్లవుతుంది. ఇక వాళ్లకు పట్టపగ్గాలే ఉండవు. అందుకోసం తాను తగ్గే ప్రసక్తే లేదు. ఇందులో న్యాయాన్యాయాల సంగతెలా ఉన్నా తాను రాజీపడదలుచుకోలేదు. చివరకు ఆ చెట్టు నరికివేయబడినా సరే, తాను మాత్రం దిగిరాడు. ఇందులో ఎందరిదో జోక్యముంటుందని తెలుసు. అయినా తాను లొంగిపోడు. కొద్ది క్షణాల్లో రాఘవరావులో ఎన్నో ఆలోచనలు.

"ఇందులో చేసేందేం లేదు. చెట్టు మా భూమిలోనే ఉంది కాబట్టి దీని కాయ కూడా మాదే. ఇన్ని రోజుల నుంచి ఎట్లా నడుస్తుందో ఇప్పుడట్లనే నడుస్తది." అన్నాడు రాఘవరావు.

**[వచ్చేవారం: ప్రోత్సాహక బహుమతి పొందిన కథ 'ఆర్తి' డి.ఆర్.ఇంద్ర]**

"అయితే మీ చెట్టు ఆకులను మా వాకిట్ల పడకుండ చూడండ్రి. మీ చెట్టు నీడ మా కిబ్బంది కావద్దు. తెంపుకునేప్పుడు ఒక్క కాయ కిందపడకుండ తెంపుకోండ్రి" అన్నాడు సురేష్.

"అదెట్లా వీలవుతుంది? మీ తాత కాలంలో, మీ నాన్న కాలంలో లేని పట్టింపులు ఇప్పుడెందు కొచ్చినయి. మీరే మొనగాళ్లనుకున్నారా?" అన్నాడో పెద్ద మనిషి కోపంగా.

"మునుపటి తీరుగనే కాలముందా ఇప్పుడు. పటేల మీ తాత కాలంల, బాపు కాలంల మీ ఇంట్ల స్కూటరుండెనా? మరి మీ రెందుకు స్కూటరు నడిపిస్తండ్రు? ఇరవయేండ్ల కింద మనూళ్లె ఒక్కే స్కూటరుండె. మరిప్పుడు? ఇరువై, ముప్పయున్నయి. ఎప్పటికాల మప్పుడే." అన్నాడు రాజు స్నేహితుల్లో ఒకడు.

"మీరు వాడెవడిదో బలం చూసుకొని మురుస్తున్నరు. వాపును చూసుకొని బలుపనుకుంటున్నారు." అన్నాడో యువకుడు.

"వాపో, బలుపో కాలమే చెబుతది. తెలుస్తనే ఉంది."

"పాతయి తవ్వుకును డాపుండ్రి." సర్పంచ్ గద్దరించగానే ఇరువైపుల యువకులు మౌనం వహించారు.

"ఇద్దరు ఎవ్వరి పట్టు మీద వాళ్లున్నరు. నువ్వేమంటావో చెప్పు ముసలయ్యా." అడిగాడో పెద్ద మనిషి.

"అయ్యాలార! నే ననేదేముంది? నా కాలం దగ్గరి కచ్చింది. ఊరు పొమ్మంటుంది. కాడు రమ్మంటుంది. ఇప్పుడు నేం జెప్పుతె వినెటోళ్లెవ్వలు పటేల. మా కాలం ఎడ్డికాలం. ఎట్లనో నడ్సింది. ఇప్పుడు పడుసోల్లది నడుత్తంది. వాళ్ల నేను చెప్పుతె వినెటట్టున్నరా? ఈ చెట్టును పెట్టి, పెంచి, పెద్ద చేసింది నేను. అట్లని చెట్టంత నాకే కావన్నంటలేను. నా మనుమలు చెప్పింది రైటే అనిపిత్తంది.

"దొరలార! పెద్దలోకుల్లార! మా కాలంల దొరలు, దాతలు, పాలేర్లు, చిన్నోల్లు, పెద్దోల్లు అందరుండెటోల్లు ఊళ్లె. ఒక్కల అవుసరంల ఇంకొక లాదుకునెటోల్లు. ఊరంత ఒక్క కుటుంబమోలె ఉండేది. మరిప్పు డూల్లల్ల మార్పు లచ్చినయంటన్నరు. పడుసోల్ల రాజ్జెం నడుస్తంది. ఇది మంచికో చెడ్డకో తెలువది. కాని మంచికే నంటుండ్రు నా మనుమలు. నేను వాళ్ల మాట వినాలె కద."

"ఎంగిలి మెతుకులు తిని బతికి అదో బతుకంటున్నావు. ఊళ్లెనట బాగ సంబంధాలున్నయట. పెద్దోల్లు చెప్పినట్టు నడిత్తె మంచిగున్నట్టు. అల్లది నడువకుంటె ఊల్లు పాడైనట్టు. గంతే కదా తాత" అన్నాడు రాజు తాతను దెప్పుతూ.

"పడుసోల్ల సంగతి గిట్లున్నది. మా కాలపొల్లకు ఊరంటె పేగు బొర్లేది. ఊరిడిసిపెట్టన్నంటె విలవిలలాడెటోల్లం. మరిప్పటోల్లు? దీని బిసాయిదెం తని ఇడిసిపెట్టిపోతరు. ఇప్పుడు అవన్నెందుగ్గని పంచాయితి నడువనియ్యుండ్రి" అన్నాడు ముసలయ్య.

"ఏం నడువనియ్యమంటవు? ఎవ్వరి పట్టు మీద వాళ్లే ఉంటిరి. ఇక మేం జెప్పెదేంది?" అన్నాడు ఓ పెద్దమనిషి.


"ఇదిలాగే నాన్చుతూ పోతే కక్షలు పెరుగుతయి. ఏదో విధంగా పరిష్కారం చెయ్యాలి. కాని ఎవరూ ఒక్క మెట్టు కూడా దిగిరావడానికి సిద్ధంగా లేరు. అందుకోసం చింతచెట్టును నరికి వేయడమే ఉత్తమం. ఏమంటారు?" అన్నాడు కరణం పంతులు.

రాఘవరావు వాళ్లు పంచాయతీకి ముందే అలా చేయాలని నిర్ణయించుకున్నారు కాబట్టి దానికి సరేనన్నారు.

"మాకు దక్కని చెట్టు ఉండెందుకు? నరికెయ్యండ్రి." అన్నారు రాజు, సురేష్.

"నరికెయ్యండ్రి... నరికెయ్యండ్రి..." అక్కడున్న వాళ్లంతా అన్నారు.

ఆ మాటలు వింటున్న ముసలయ్యకెంతో బాధాకరంగా ఉంది. కడుపులోంచి ఆవేదన తన్నుకొస్తోంది. ఆ చెట్టుతో ఆతనికున్న అనుబంధం జ్ఞాపకం వచ్చింది. ఆ చెట్టు కిందే ఎంతో మంది ఆడుకోవడం జ్ఞాపకం వచ్చింది. మూడు తరాలను



చూసిన ఆ చెట్టును నరకడమంటే మనుషుల్లోని ప్రేమలను, అనుబంధాలను, ఆప్యాయతలను నరుకుతున్నట్టే ననిపిస్తుందతనికి.

లేచి నిల్చున్నాడు ముసలయ్య. చేతులు పైకెత్తాడు.

"ఓ దొరలారా! పటేలండ్లార... పెద్దలోకుల్లార... ఎవ్వల పట్టు మీదాళ్లుండి చెట్టును నరుకుతననుడు మంచిగలేదు. నీడనిచ్చే చెట్టును, కాయనిచ్చే చెట్టును నరుక్కునెటోల్లు మనుషులేనా? ఈ చెట్టును నరుకద్దు బాంచెను. అసలే నరుకనియ్య.. చెట్టును నరికిండ్రంటె తల్లన్న రికినట్టే.. దీన్ని నరుకద్దు.

"అరే రాజా! సురేషా! నా మాటినండ్రి బిడ్డ. ఆ చింతకాయ మనకు రాకున్నా మంచిదే. చెట్టు నుండనియ్యండ్రి. పట్టువట్టకుని." అంటూ రెండు దిక్కుల వాళ్లనూ ప్రార్థిస్తున్నాడు ముసలయ్య. చెట్టు దగ్గరకెళ్లి దాన్ని పట్టుకొని కూర్చున్నాడు.

అయినా ఎవరూ ముసలయ్య మాట వినదలుచుకోలేదు.

"ముసలోడ జరుగు..." అని అతన్ని తీసుకొచ్చి దూరంగా నిలబెట్టారు.

రాఘవరావు మనుషులు నలుగురు గొడ్డళ్లతో నరకడం మొదలుపెట్టారు.

చెట్టు మీద పడుతున్న ఒక్కో వేటు ముసలయ్య హృదయంపై పడుతున్నట్టే ఉందతనికి. కడుపులోంచి దుఃఖం, ఆవేశం ఎగదన్నుకొస్తున్నాయి.

"అరేయ్ నా మాటినండ్రా. ఆ చెట్టును పెట్టింది నేనురా... సాదింది నేనురా... ఆ చెట్టంటే నాకు పానంరా... ఒరేయ్ గొండ్రాలకేం తెలుసురా కనడంలోని బాధ? ఆ చెట్టుతో నాకెంత బంధముందో మీకేం తెలుసున్రా. వద్దురా. చెట్టును నరకద్దురా. ఎలుకలున్నయని ఇల్లును కాలబెట్టుకుంటార్ర ఎవ్వడన్న. దొరా! చెట్టును నరుకు డాపుజెయ్యండ్రి. రాజా! సురేషా... మీ తాత మాటినుండ్రి. చెట్టుతోనేం రాకుంటె మానాయె. చెట్టును నరుకద్దు." ఏడుస్తూ, మొత్తుకుంటూ అందర్నీ తిడుతున్నాడు ముసలయ్య.

అయినా ముసలయ్య మాటల్ని పట్టించుకున్నవాళ్లు లేరు. నలుగురు మనుషులు చెట్టును నరుకుతూనే ఉన్నారు. మరికొందరు కొమ్మలు నరకడానికి పైకెక్కుతున్నారు. ఇంకొందరు తాళ్లు తీసుకురావడానికి కెళ్తున్నారు.

ముసలయ్య మొత్తుకుంటూనే ఉన్నాడు. చెట్టు దగ్గరి వెళ్లబోయిన ముసలయ్యను అతని మనుమలు పట్టుకున్నారు.

చెట్టును నరుకుతున్న దృశ్యాన్ని చూడలేక పోతున్నాడు ముసలయ్య. ఊళ్లో పెనవేసుకున్న బంధాలను నరికివేస్తున్నట్టనిపిస్తుందతనికి. అయినా ఆ సృష్టికర్త ఆవేదన నెవరూ అర్థం చేసుకోవడంలేదు.

"వద్దురా... చెట్టును నరకొద్దురా... ఒక్క చెట్టునైనా పెంచని మీకేం తెలుసురా ఇందులోని బాధ? మీకు దండం బెడుతరా... చెట్టును నరుకొద్దురా... నేను సచ్చేదాకన్న ఉండనియ్యరా...." ఏడుస్తూ అరుస్తూనే ఉన్నాడు ముసలయ్య.

రాజు, సురేష్ ముసలయ్యను బలవంతంగా గుడిసెలోకి లాక్కెళ్లారు. మరో దిక్కు చెట్టును నరికే కార్యక్రమం కొనసాగుతూనే ఉంది.

ఏడెనిమిది దశాబ్దాల కాలానికి సాక్షీభూతంగా నిలిచిన ఆ చెట్టు పొద్దుగూట్లో పడే సమయం వరకు ముక్కలు ముక్కలుగా నరకబడి రాఘవరావు వాకిట్లో కుప్పలు కుప్పలుగా పడుంది.

గుడిసెలో అరుస్తూ, అరుస్తూ, ఏడుస్తూ, ఏడుస్తూనే స్పృహతప్పి పడిపోయాడు ముసలయ్య.

## డిటర్జెంట్ సబ్బులు మురికి నెలా పోగొడతాయి ?

మనకందరికీ డిటెర్జంట్ సబ్బులు మురికిని పోగొడతాయని తెలుసు కాని, అవి ఎలా పోగొడతాయో మీ కెవరికైనా తెలుసా? కాస్టిక్ సోడా, ఆయిల్ మిశ్రమం వల్ల జరిగే రసాయన క్రియ వల్ల సబ్బు ఏర్పడుతుంది. ఈ సబ్బును బట్టమీద రుద్దినప్పుడు సబ్బులోని అణువులు ఫాటీఆసిడ్ అయాన్‌లగానూ, సోడియం అయాన్‌లగానూ విడిపోతాయి. ఫాటీ ఆసిడ్ అయానులు బట్టలనంటి ఉండే దుమ్మూ ధూళి, మురికి ఆకర్షణలకు లోనై వాటిని చుట్టుముడతాయి. అప్పుడు మనం బట్టను విదిలించినప్పుడు ఫాటీ ఆసిడ్ అయానులతోపాటు మురికి కణాలు కూడా బయటకు వస్తాయి. చూశారా, మనందరికీ తెలిసిన సాధారణ ప్రక్రియలో ఎంతటి రసాయన క్రియ దాగుందో!

సేకరణ : దాసరి బాలయ్య [ఆలూరు]




## దేవికారాణి పరిచయం చేసిన దిలీప్

ఇటీవల దివంగతురాలైన దేవికారాణి గురించి ఎంత చెప్పినా ఇంకా చెప్పవలసింది మిగిలిపోయే ఉంటుంది. నటిగా తన నటన, సౌందర్యాలతో మహామహులనే మురిపించింది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ - ఈమెకు లేఖరాస్తూ "మీ నటన, రూపలావణ్యాలు నన్ను ఆకట్టుకున్నాయి" అని పేర్కొన్నాడు. యాభై ఏళ్ల క్రితం ఆమె నటిగా ఉన్నతస్థానంలో ఉండేది.

బొంబాయి టాకీస్ స్టూడియో వారి చిత్రాలు అప్పుడు మంచి కీర్తి ప్రతిష్ఠలు పొంది, ఆర్థికంగా విజయవంతమయ్యేవి. ఎందరో కళాకారులను పరిచయం చేసిన సంస్థ. అశోక్‌కుమార్ వీరి చిత్రాలతోనే సినిమా జీవితం ఆరంభించాడు. స్టూడియో భాగస్థులలో అగ్రస్థానం హిమాంశురాయ్ దంపతులది. రాయ్ స్వర్గస్థుడయ్యాక, ఆ బాధ్యతను దేవికారాణి వహించి, నటన విరమించి నిర్మాతగా ఉంటూ చిత్రాలు నిర్మించేది. అప్పుడు ఒక యువకుడు సినిమాల్లో నటించాలనే ఆసక్తితో దేవికారాణిని కలుసుకోడానికి వెళ్లాడు.

ఆ యువకుడిని క్షణం చూసి కొన్ని ప్రశ్నలు వేసింది.

"నీ పేరేమిటి?"

"యూసుఫ్ ఖాన్."

"సినిమాల్లో నటిస్తావా?"

"నటిస్తాను."

"హిందీ, ఉర్దూ బాగా వచ్చా?"

"వచ్చు."

"సిగరెట్టు తాగుతావా?"

"తాగను."

"ఇంతకు ముం దెక్కడయినా వేషాలు వేశావా?"

"లేదు."

"కారు నడపడం వచ్చా?"

"వచ్చు."

ముక్తసరిగా జవాబిచ్చిన ఆ తీరు దేవికారాణికి నచ్చింది. అతని వర్చస్సు కూడా బాగుం దనిపించి "మా చిత్రంలో నీవు నటిస్తున్నావు" అని చెప్పింది.

యూసుఫ్ ఖాన్ కృతజ్ఞతలు చెప్పాడు. బొంబాయి టాకీస్ వారి 'జ్వార్ భాటా' [1944]లో నాయక పాత్ర నటించాడు. అతని పేరును దిలీప్‌కుమార్‌గా మార్చడం జరిగింది. ఇందులో నాయికగా మృదుల వేసింది. దేవికారాణిచే తెరకు పరిచయమైన వాడు భారతీయ చిత్రసీమలో 'ట్రాజెడీ కింగ్'గా పేరొంది గొప్ప వెలుగు వెలిగాడు!

సేకరణ : ఆరిపాక

**వారం వారం కథాప్రభ**

**" గ్రామీణ మనస్తత్వాన్ని జీర్ణించుకున్న వాళ్లు కల్లాకపటం లేని వాళ్లుగా ఉంటారు. ఘోరమైన అబద్ధాలాడరు. అంటే నాగరికులమని చెప్పుకునే వ్యాపార నాగరికత జీర్ణించుకున్నవారిలాగా. మనకు లాగా వాళ్లకు డబ్బు మీద మోజుం డదు. వాళ్ల మనస్తత్వాలంటే నాకు చాలా ఇష్టం.... "**

**నా మాటలు విని సునీల్ పకపకా నవ్వాడు. అతడలా నవ్వుతుంటే నా ముఖం చిన్నబోయింది.**

"మహేందర్...! నువ్వింకా బి.సి యుగంలోనే ఉన్నట్టున్నావు. ఇప్పుడు ఊర్లు మునపట్లా లేవు. సర్వదుర్లక్షణాలూ ఊళ్లోకి ప్రవేశించాయి. డబ్బు తన వికృత రూపాన్ని ఊళ్లమీద చూపుతూనే ఉంది." అన్నాడు.

"సునీల్ ! నీ మాటలు ఎంతో కొంత నిజమే కావచ్చు. కాని మా ఊరి సంగతి నీకు బాగా తెలియదు. మా ఊరు పట్టణాలకు చాలా దూరంలో ఉంది. అక్కడి మనుషులు వ్యాపారనాగరికత మోజులోపడ్డారని నేననుకోను. పాలు తీసుకెళ్లి పట్టణంలో అమ్ముకోవడం లాంటి పనులు కూడా వాళ్లు చేయడం లేదు. ఇప్పటికీ...' 'అన్నాను.

" కావచ్చు. పట్టణాలకు చాలా దూరంలో ఉంటే అదెలా సాధ్యపడుతుంది? అయినా ఊరూరుకీ తిరిగి పాలు సేకరించుక పోయేవాళ్లు మీ ఊరికి రావడంలేదని నేననుకోను. నీకు మీ ఊరుమీద, పల్లెటూళ్ల మీద చాలా ప్రేమున్న మాట నిజమే కానీ ...చాలాకాలం నుంచి నీకు ఊళ్లతో ఉన్న సంబంధాలు అంతంత మాత్రమే! తేపకోసారి పోయిరావడమే తప్ప అక్కడే నివశించడం లేదు. అందువల్ల నీకు వాట్ని గురించి స్పష్టంగా తెలుసునని నేననుకోను. పోగా ఇరవైపాతికేళ్ల క్రితం నాటి అమాయకపు తెలంగాణా పల్లెలే నీకు కనబడు తున్నాయి. ఇప్పుడు ఊళ్లలో చాలా మార్పులొచ్చాయి. ఊళ్లిప్పుడు నువ్వను కుంటున్నట్టుగా అమాయకమైన కన్నెపిల్లల్లా లేవు. అనుభవాలసారంతో గడుసువైన ప్రౌఢస్త్రీల్లా ఉన్నాయి."

సునీల్ వాడిన ప్రతీకలు నాకు నవ్వు తెప్పించాయి.

"అయితే కావచ్చు. కన్నెపిల్లలెప్పుడూ కన్నెపిల్లల్లాగే ఉండరు కదా! కొన్ని మార్పులొస్తే రావచ్చుకానీ వాళ్ల మనస్తత్వాలు , ప్రేమానురాగాలు నన్ను ఇంకా ఊరివైపే మొగ్గేట్టు చేస్తున్నాయి."

నా మాటలు అమాయకుడి మాటల్లాగా అనిపించాయేమో, సన్నగా నవ్వాడు సునీల్.

"సునీల్ ! ఇందులో నాకేం అసహజమైనవి అగుపించడం లేదు. మారుతు న్నకాలం, అవసరాలు, పెరుగుతున్న వేగం వాళ్లలో కొన్ని మార్పులు తెస్తున్నా యేమో! తెస్తాయికూడా! అయితే నువ్వన్నట్టు వాళ్లెంత మారినట్టనిపించినా సోకాల్డ్ నాగరికులన బడే వాళ్లకున్నంత స్వార్థం, మాయదారితనం వాళ్లకు లేదన్న విషయం నువ్వు మరిచిపోవద్దు" అన్నాను.

"ఉద్యోగరీత్యా గ్రామాలకు దూరంగా ఉంటున్నా గ్రామాల మీద నీకున్న ప్రేమకూ , అభిమానానికీ హేట్సాఫ్! గ్రామాలపై నీకున్న ప్రేమ మనస్ఫూర్తిగా ఉన్నదేనని నా అభిప్రాయం. అయితే నేననేది గ్రామీణుల్లోనూ యాంత్రిక నాగరి కత ప్రభావం పడిందని, వాళ్లా మునుపటంత నిష్కల్మషంగా , నిష్కపటం గా ఉండటం లేదు' ' అన్నాడు సునీల్ .


ఏదో కొంత మార్పు వస్తే వచ్చి ఉండవచ్చు. కానీ నువ్వెంత చెప్పినా మన సంస్కృతీ సంప్రదాయాలు, నిజమైన నాగరికత గ్రామాల్లోనే బతికున్నాయని నేను నమ్ముతాను" అన్నాను.

" ఓకే దోస్త్ ..నీ నమ్మకాన్ని ఎందుకు కాదనాలి? అయితే వాళ్ల మనస్తత్వాల్లో, ప్రవర్తనలో వచ్చిన మార్పులను నీకు ప్రత్యక్షంగా అనుభవపూర్వకంగా అర్థ మయ్యేట్టు చేస్తాను. కాలికి పెడితే మెడకు , మెడకు పెడితే కాలికంటూ వాళ్లెలా ముప్పుతిప్పలు పెడుతున్నారో నువ్వే చూద్దువులే! నీ చెలుకను మీ చిన్నాన్నే కొన్నాడు కదా! అందులోని కొంతభాగాన్ని నర్సయ్య కమ్మావు కదా! దాని కోసం వాళ్లిద్దరూ పోట్లాడు కుంటున్నారు, నిన్ను వెంటనే రమ్మంటున్నారు. మొన్న నర్సయ్య నాతో చెప్పాడు."

'రెండురోజుల్లో పోదాం. నువ్వూ నా వెంట రావాలి. నాకు సాయంగా ఉన్నట్టుంటుంది. మన ప్రశ్నలకు సమాధానాలు కూడా వెతుక్కున్నట్టవుతుంది.'

ఆదివారం రోజున సునీల్‌ను తీసుకుని మా ఊరికి బయలుదేరాను. బస్సు మా ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించినప్పుడల్లా నా శరీరం

## సృష్టికర్తల చిరునామా • కొటక మల్లయ్య



పులకిస్తుంది. చల్లగాలి నాకాహ్వానం పలికినట్లనిపిస్తుంటుంది. చెట్లు ఆప్యాయంగా పలుకరిస్తున్నట్లు తోస్తుంటుంది. చెట్లు, గుట్టలు మా చెరువుపై నుండి వచ్చే చల్లగాలి అన్నీ నన్నాప్యాయంగా అక్కున చేర్చుకుంటున్న అనుభూతి కలుగుతుంటుంది.

నాలోని పులకింతను, పారవశ్యాన్ని గమనించాక సునీల్ -" మహేందర్ ! నిజంగా నీదో విచిత్రమైన మనస్తత్వం. ఈ ఊరు నీకేమి ఒరగబెట్టిందని నీ కింత పారవశ్యం? లక్షల ఆస్తులు పొందినవాళ్లు కూడా ఇంత పరవశం చెందరు" అన్నాడు.

"ఏం?.. ఏం తక్కువైంది నాకు? నాకు ఊళ్లో పెద్దగా ఆస్తిలేదన్న మాట నిజమే! ఉన్న కొద్దిపాటి ఆస్తీ నాకు కాకుండా పోయిందన్న మాటా నిజమే! మిగిలిన స్వల్పభాగం ఎందుకూ కొరగానిదే కావచ్చు. అయినంత మాత్రాన ఊరు నాకేమివ్వ లేదంటావా? నా ఊరు నాకు జన్మనిచ్చింది. చదువు నిచ్చింది. పాతికేళ్ల జీవితాన్నిచ్చింది. ఉద్యోగం దొరికేంత వరకూ నేనీ ఊరి మట్టివాసనను పీలుస్తూనే బతికాను. నా తండ్రి భూమిపై వచ్చిన ఆదాయంతోనే పెరిగాను. ఇంకేమివ్వాలి నాకు ఊరు? అప్పులైతే ఇవ్వలేదు కదా! అది చాలదా? అందరికీ లక్షల ఆస్తులే సంక్రమించాలంటే ఎలా సాధ్యమవుతుంది?"

నన్ను ప్రశంసాపూర్వకంగా చూసాడు సునీల్.

బస్సు మా ఊరి బస్టాపులో ఆగింది. బస్సు దగ్గర నా భూమికొన్న మా అమ్మమరిది కొంరయ్య చిన్నాన్న, మా సొంత చిన్నాన్న వీరయ్య, మరో నలుగు రైదుగురు నిల్చొనొన్నారు. వాళ్లనక్కడ చూసిన నాకెంతో సంతోషం కల్గింది.

"మనం వస్తామని తెలిసి బస్టాండులో మన కోసం ఎదురు చూస్తున్నారు. మనలాంటి వాళ్లమయితే ఇలా చేయగలమా? ఊళ్లలో ఇలాంటి ప్రేమలు, అతిథిసత్కారాలింకా ఉన్నాయనడానికిది నిదర్శనం కాదా?" అన్నాను సునీల్‌తో- బస్సుదిగుతూ.

"తర్వాత మాట్లాడుకుందాం"అన్నాడుసునీల్. అంతలో నర్సయ్య వచ్చి నమస్కరించాడు. మేమిద్దరమూ ప్రతి నమస్కారం చేసాము.

"పొద్దటి బస్సుకే వత్తరనుకున్నం బిడ్డ. బారెడు పొద్దెక్కె. ఇంకొంచెమైతే ఎక్కడోల్లక్కడ వెళ్లిపోతరు. మొసమర్లకుంట పనులున్న కాలం. వీపుగోక్కుం దామన్నా తీరిసత్త లేదు" అన్నాడు





## అతివలూ...
## జాగ్రత్త!

**మేకప్ సామగ్రిద్వారా అంద మేకాక, అనారోగ్యంకూడా వచ్చే అవకాశం ఉంది. మేకప్ సామగ్రి లో బాక్టీరియా పెరిగే అవకాశా లెక్కువకాబట్టి ఈ కింది జాగ్రత్తలు తీసుకుంటే జెర్మ్-ఫ్రీ మేకప్‌ని మీరు అప్లై చేసుకోవచ్చు.**

1. మేకప్‌కి మునుపు మొహాన్ని, చేతుల్ని సబ్బుతో శుభ్రం చేసుకోండి. ఇందువల్ల మేకప్ సామగ్రిలోకి వేళ్లే బాక్టీరియా నశిస్తుంది.


2. మీ కాస్మొటిక్స్‌ని ఇతరులతో పంచుకోకండి; ఇతరులది మీరూ వాడకండి.

3. కనీసం వారానికోసారయినా మీ మేకప్ బ్రష్‌లని, స్పాంజ్‌ని, ఇతర అప్లికేటర్స్‌ని వేణ్ణీళ్లలో కడుగుతూండండి.

4. మేకప్ సామగ్రిని రూమ్ టెంపరేచర్‌లో, పొడి ప్రదేశంలో భద్రపరుస్తూండండి. వేడి, తడి బాక్టీరియాని అభివృద్ధి చేస్తాయి. అంటే బాత్‌రూములో మేకప్ సామగ్రిని ఉంచకూడదన్నమాట.

5. మీ కాంపాక్ట్‌ని, ఇతర కాస్మొటిక్స్ పెట్టెలని సదా మూతలు మూసి ఉంచండి.

చివరగా, **ఏడాదిదాటిన కాస్మొటిక్స్ సామగ్రిని పారేయండి.** అయితే **కళ్లచుట్టూ వాడే లిక్విడ్స్, మస్కారాల విషయంలో** ఈ నియమం వర్తించదు. ఎందుకంటే, **ఇవి ఆర్నెల్లకే పారేయాలి.**



డి. పద్మజ

మా చిన్నాన్న వీరయ్య.

కొంరయ్య కొడుకులిద్దరూ ముఖం మాడ్చుకొనున్నారు. "ఏం జెయ్యన్నే! మబ్బుల్నే లేచి తయారయినం. అక్కన్నుంచి బస్సుదొరకిచ్చుకోని వచ్చె వర్కు ఈ ఊరికొచ్చే బస్సు ఎల్లేపాయె. ఇగ ఈ బస్సు కోసం గంటకూచున్న మక్కడ" అన్న నేను.

"అయితెనేమాయెపటు బిడ్డ స్కూటరుంది గద.....దానిమీద రాకపోయింర్రా?" అన్నాడు వీరయ్య.

"మా రావచ్చు. కానీ రోడ్డెప్పుడూ సందడిగానే ఉంటుంది. బాగాక్సిడెంట్లయితున్నయి. తలకాయ నొప్పని బస్సుకే వచ్చినం" అన్నాను.

వీరయ్యతో వాళ్లింటి కెళ్లాం. కొంరయ్య, నర్సయ్య మనుషులను తెచ్చు కుంటానికి ఊళ్లోకెళ్లారు. వాకిట్లో వాల్చున్న మంచంలో కూర్చున్నాం.

"ఇగ కూచుంటే పెద్ద పంచాయితే అయ్యేట ట్టుంది. పొద్దెక్కింది. మీరొస్తరని బువ్వండిపించి వుంచిన. పెద్ద మనుషులు కూడేవరకు బువ్వతినుండ్రి. బావి మీదికి పోయి కాల్లుకడుక్కొండ్రి బిడ్డా!" వీరయ్య మాటలు విన్న నా ముఖంలో ముడతలు పడ్డాయి.

"ఏందే చిన్నాన్నా! ఇందులో పంచాయితేముంది? "అన్నాను.

"ఇదేమన్న లక్కబుల్లకాయల ఎవారమను కుంటున్నవా? నీతీరుగనే అందరుంట రనుకుంటున్నవా బిడ్డ! నువ్వేమొ దరమరాజువు. గుంట చిక్కులన్ని నీకు తెలువయి. ఎక్కడికో ఓ కాడికి అదే తెగుతదికని మీరైతే అన్నం తినుండ్రి...కాల్లు కడుక్కోండ్రి" అన్నాడు వీరయ్య.

"నీ కొడుకు అందరు తన తీరుగనే ఉంటరనుకుంటడే మామ. సంగతేందో ఇప్పుడు తెలుస్తది" అన్నాడు సునీల్.

"నా కొడుకుని దెప్పవల్సిందేం లేదు. ఆడు దరుమరాజు. దరుమరాజు కెప్పుడు అపజయం గలుగది. సరెగని అన్నం తినుండ్రి."

"మాకిప్పుడాకలేమవడం లేదే మామ! వచ్చేటప్పుడే టిఫిన్ చేసివచ్చినం. మధ్యాహ్నం వరకాకలి కాదు మాకు? మాట్లాడుకోవడమయిపోనియ్యలేవు. పోయే టప్పుడు తింటం" అన్నాడు సునీల్.

"ఛట్ నీ యవ్వ! గా టిఫిన్ తింటె కడుపునిండుతదా? మరన్నం తినుండ్రి. తినేవరకందరస్తరు" ఖచ్చితంగా చెప్పాడు వీరయ్య.

"మా చిన్నాన్న పట్టువడితె విడిచిపెట్టడు. పల్లెటూళ్లో అన్నం తిన్న తర్వాతే మిగతా ముచ్చట్లు. పట్టినంత రెండు బుక్కలైనా సరే తిందాం." అని సునీల్ ను తీసుకొని బావి దగ్గరకెళ్లాను.

కాళ్లు చేతులు కడుక్కోని ఇంట్లో కెళ్లాము. మా కోసం వేసున్న పీటలమీద కూర్చున్నాం. కందిపప్పు, తాళింపు పెట్టిన పులుసు చేసింది చిన్నమ్మ. పక్కన మామిడికాయ పచ్చడుంది. నూనెక్కువగా లేకపోవ డం వల్ల ముక్కమెత్తగుంది.

పప్పు,చారు కలుపుకొని తింటుంటే రుచికరం గానే ఉంది.

మా దగ్గరే గొంగడి ముద్దగా వేసుకొని మా చిన్నాన్న కూర్చుని అన్నం తింటున్నాడు. "ఓ కొన్ని దొరకవట్టి కొయ్యాన్నని అనుకున్న కని బిడ్డ, నీ భూమిని కొన్న చిన్నయ్య, మీ వోల్లు ఏడుత్తరని ఊకున్న. మల్ల నువ్వచ్చేదేమొ పంచాయితి కాయె' ' అన్నాడు వీరయ్య.

"మాంసం, కోడికూర ఎవ్వలకు కావన్నే మామ? ప్రేమతో పెట్టిన పచ్చడిమెతుకులైన మంచిదే!" అన్నాడు సునీల్.

"కడుపు నిండ తినుండ్రి బిడ్డ..."

"పెరుగు లేదాయె మామ?"

"బర్రె సూడిదయింది బిడ్డ. ఇంక రొండు నెల్ల యితె ఇంటి నిండ పాడే!"

"బర్రె పాలియ్యకుంటె కొనుక్కోరా." అన్నాడు సునీల్.

"రూపాయలకు రూపాయలు పెట్టి పాలు పెరు గుకొని తాగన్నేంటే ఎల్లుతదా బిడ్డ మాకు. ఇంట్లుంటే బాగనే తాగుతం. ఇంట్ల పాడి లేకుంటే కొనుక్కోని తాగుడు తక్కువే! మీరత్తున్నరని పెరుగు కోసం రొండుమూడిండ్లు మా తిరిగిన కానీ దొరుకలే! " అన్నాడు వీరయ్య.

భోజనాలు ముగించి లేచి వాకిట్లో కొచ్చాము.

ఐదారుగురు పెద్దమనుషులు, నర్సయ్య, మా చిన్నాన్న, ఆతని కొడుకులు వచ్చారు. కొందరు వాల్చున్న మంచాల్లో, ఇంకొందరు అరుగంచుకు కూర్చు న్నారు.

సునీల్, నేను పెద్దమనుషుల పక్కన మంచంలో కూచున్నాం. ఈ విషయంలో ఇంతమంది పంచాయితీ పెద్దలనెందుకు పిలువాల్సివచ్చిందో నా కర్థం కాలేదు. నేను నా ఊరి వాళ్లపై పెట్టుకున్న నమ్మకాలేమవుతున్నాయి? ఈ సమస్య జటిలం కానుందా? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను.

'ఏంటి మహేందర్! చదువుకున్నోడివి. అన్నీ తెలిసినోడివి. నలుగురికి చెప్పవలసినోడివి నువ్వే చెప్పించుకుంటేమన్నట్టు? చాట్ల తవుడు బోసి కుక్కలకు కొట్లాట పెడ్తరంటరు చూడు, గట్లయింది నువ్వు చేసిన పని! ఒకే చేనును ఇద్దరికమ్ముడేంది?' అన్నాడు నర్సిరెడ్డి నిష్టూరంగా.

ఉపోద్ఘాతమేం లేకుండా నేరుగా నా పైకి దాడి ప్రారంభించడం నాకు బాధాకరంగానే ఉంది.

"ఒకే భూమిని నేనిద్దరికెక్కడమ్మాను? అరవై కుంటల్లోంచి పదిహేను కుంటలది ప్రత్యేకంగా ఉందని, దాని మీద నర్సయ్య బయానా తీసుకున్నాను. ఈ విషయం చెప్పినా వినకుండా మా చిన్నాన్న కొంరయ్య, ఆతని కొడుకులు మొత్తం అరవైకుంటల భూమికని పదివేలే బయానా ఇచ్చారు. ఆరోజే నర్స య్యను పిలుద్దామంటే దొరుకలేదు. ఎలాగో ఎవర్నో ఒకర్ని ఒప్పించుకొమ్మని అప్పుడున్న పెద్దమనుషులు చెప్పలేదా?" అన్నాను.

"ఆ భూమి కొంరయ్య, మీ పొత్తులున్నది. కొంరయ్య కొనానన్నప్పుడే వేరే వాళ్లకమ్మాలి. నర్సయ్య కెలా అమ్మావుదాన్ని?"

"రెండేళ్లుగా మా చిన్నాన్నకు కొనమని చెబుతూనే ఉన్నాను. తానుకొననన్నాడు. తీరా పంచుకొని అమ్మిన తర్వాత మొత్తం తనకే కావాలని బలవంతం చేసారు. అయినా నా భూమిని నేనమ్ముకుంటే తప్పేముంది?"

"భలేటోనివే ఉన్నవు మహేందర్ ! అది జాయింట్ పట్టా భూమి. ఎవర్నో తీసుకొచ్చి మధ్యలో పెడితే మీ చిన్నాన్న వాళ్ల కిబ్బంది కాదా! నీల్ల దగ్గర, ఇతర విషయాల దగ్గర" అన్నాడు మరొక పెద్ద మనిషి

'బావితో కానీ, కరెంటు మోటారుతో కానీ నర్సయ్యకేం సంబంధం లేదు. పోగా ఆ ముక్క ప్రత్యేకంగా ఉంది. ఎంత చెప్పినా మా వాళ్లు కొనమ న్నారు. అందుకే దాన్ని నర్సయ్యకమ్మాను. దాని ధర వదిలిపెట్టి మిగతా భూమికి డబ్బులిస్తే అయిపోతుంది కదా! ఇందులో పంచాయితేముంది? '

"మంచిగనే చేసినవు తియ్యి. పదిహేను కుంటలకు నర్సయ్య దగ్గర బయానా తీసుకొని భలే మంచిపని చేసినవు. మరిగ ఎవ్వలనెట్ల మెప్పించుకుంటవో మెప్పించుకో!"

నన్ను దోషినిచేస్తూ అన్నాడు సర్పంచ్ . చేస్తూ " నేనిలా తీసుకోవడంలో ఏ ఉద్దేశ్యమూ లేదు. మా నాన్న చనిపోయింతర్వాత రెండు మూడేళ్లుగా ఆ భూమి లోంచి ఒక్క ధాన్యంగింజ కూడా నాకివ్వలేదు మా చిన్నాన్న వాళ్లు. పోగా పెట్టుబడులకని, ఎరువులకని వందా, రెండువందలు నా దగ్గరే వసూలు చేసారు. నేనుంటున్నదేమో దూర ప్రదేశంలోనాయె. అందుకే అమ్మాలను కంటున్నాను. వాళ్లు కొనమంటే కొనలేదు. పంచుకొని కొంత నర్సయ్యకమ్మిన తర్వాత అంతా కావాలని అలా చేసారు. ఇందులో నేను చేసిందేముంది?" అన్నాను.

" మహేందర్ నువ్వేమన్న వేలుపెడితే చీకని , వెన్న పెడితే నాకని చిన్నపిల్ల వాడివా? నర్సయ్యకమ్మిందానికి వదిలిపెట్టి ధర చేసుకొమ్మని గట్టిగా చెప్పొద్దా? నీది నువ్వు అమ్ముకోవచ్చు కానీ ఇట్ల కాదు. మరిప్పుడేం చేస్తావో చెయ్యి. నర్సయ్య తాను బయానిచ్చిన భూమిని వదలనంటున్నాడు. కొంరయ్య తనకు మొత్తం భూమి కావాలంటున్నాడు. ఎవర్ని ఏ విధంగా ఒప్పిస్తవో ఒప్పించు. " అన్నాడు రాజిరెడ్డి.


" అంతా నా వాళ్లే నన్న నమ్మకంతో ఇట్లా చేసాను. మా చిన్నాన్న - నర్సయ్య ఇచ్చే డబ్బును మినహాయించుకుని మిగతా డబ్బులిస్తే సరిపోతుంది. లేదా తన బయాన తాను తీసుకొని విరమించుకున్నా మంచిదే! ఎవన్నో ఒకర్ని ఒప్పుకొమ్మని నేను వేడుకుంటున్నాను."

కొంరయ్య కొడుకులు నా మీదికి గుయ్ మని లేచారు.

" జాయింటుపట్టా ఉన్న భూమిని నర్సయ్యకెలా అమ్ముతావో మేం చూస్తాం. అందులోకి మరొకరు రావడం మాకిష్టం లేదు. అమ్మితే మొత్తం మాకే అమ్ము. మాట తప్పద్దు. లేకుంటే మేమిచ్చిన పదివేల బయానకు పదివేల రూపాయలు కలిపి మా కిచ్చెయ్యి. లేకుంటె పుర్రెలెగురాలె. ఆ భూమిలకు నర్సయ్య నాగలెట్ల వత్తదో మేం జూత్తం..."

ఆమాటలు నాకు బాధాకరంగా ఉన్నాయి. నా చిన్నమ్మ కొడుకులే నాతో ఇలా సవాలు చేయడం నన్ను మరింత బాధకు గురిచేసాయి. కొద్దిక్షణాలు నా నోటినుంచి మాట రాలేదు. నేను మాట్లాడబోయేంతలో సునీల్ అందుకున్నాడు.

" అలా పట్టుపట్టుకుని కూచుంటే ఏమన్నట్టు? మీరేదో తన వాళ్లని , వ్యవసాయం చేస్తూ పంటలే పండిస్తూ కష్టపడుతున్నారని మీ అన్న మీమీద సానుభూతి తో ఉన్నాడు. ఆతనినమ్మకాన్ని గంగల కలుపకుండ్రి. ఆ పదిహేను గుంటలకు నర్సయ్య దగ్గర బయానా తీసుకున్నాడని తెలిసి కూడా మీరెందుకు బలవంతం చేసారు మొత్తమియ్యమని? అది పోగా మిగతా భాగానికి ధర చేసుకోవాల్సింది. మీరమాయకులని , చెప్పినట్టు వింటారని నమ్మినందుకు మీ అన్నకు తగిన బుద్దే



## శపించడం

పత్రికకు కట్టిన సంవత్సర చందా అయిపోవచ్చిందని మూడు నెలలుగా మూడు నోటీసులు పంపించినప్పటికీ ఓ పెద్దమనిషి జవాబు రాయలేదు. చందా కూడా కట్టలేదు. ఇక ఆ సంచికతో ఆ చందా అయిపోవస్తుంది. అందుచేత ఆ సంచికతోపాటు పత్రికవాళ్లు ఒక ఉత్తరం జతపరిచారు. "అయ్యా! ఇక మీరందుకునే చిట్టచివరి సంచిక ఇదే అని తెలుసుకోండి!" అని క్లుప్తంగా రాశాడు - ఒళ్లుమండిన సర్క్యులేషన్ మేనేజర్ ఆ ఉత్తరంలో.

అందుకా పెద్దమనిషి జవాబు ఇలా ఉంది - "అయ్యా! నా కిప్పుడు 99 ఏళ్లు. నేను ఆ మరొక్క సంవత్సరంపాటు బతకకూడదని శపించడం భావ్యమా?"

వి. బాలకృష్ణ (పామర్రు)

---

చెప్పుతున్నారు."

అన్నాడు సునీల్ అందరినీ దబాయిస్తున్నట్టు.

" మహేంద్రన్న భూమిని తనది తానమ్ముకున్నడు. నీకు బాగ బలముందా? ఇయ్యాల్లనే నాగలి గట్టుత అందులో . ఏం జేస్తవో చెయ్యి" అన్నాడు నర్సయ్య గట్టిగా. ..

ఆతనికి మద్దతుగా ఆతని కులం వాళ్లలేచారు. మా చిన్నాన్న కొడుకులకు మద్దతుగా మరి కొందరు లేచారు. కొందరటూ.....కొందరిటుగ వాదోపవాదాలు జరుగుతున్నాయి.

"మహేందర్ చదువుకున్నడు. గీ గుంట చిక్కులన్ని తెలువనోడు. నౌకరి జేసుకుంట తన చందాన తాను బతుకుతున్నడు. పాపం.. ఊళ్లున్న ముత్తెమంత భూమిని అమ్ముకొని పోతున్నడు.. తిప్పలు పెట్టకుండ్రి. ఎవ్వలో ఒకరు దిగిరాండ్రి." అన్నాడు లచ్చయ్య షావుకారి.

"చేసిండు.. కూసున్నడు. మందనడు.. మాకనడని ఏందిది? ఇద్దరికి తఖురారుపెట్టి కూసున్నడు. భూమేం పుక్కానికిస్తున్నడా?" అన్నాడు మా చిన్నమ్మ కొడుకు.

"ఇంత పొడుగు ధర పెట్టి నవా? అగ్గువనగ్గువకు దొబ్బు కుంట ఇంక మాట్లాడతన్నవు. ఊళ్లె వసతి లేక అమ్ముకుంటన్న డు కానీ ఆ ధర కమ్మేదేనా?" గద్దరించినట్టన్నడు మా చిన్నాన్న వీరయ్య.

"వీరయ్యా! నువ్వెప్పుడు మాట్లాడినా నీళ్లళ్ల పిత్తినట్టే ఉంటది. భూమి ధరలు లెక్కనా? అక్కన్నే అంతకంటే ఎక్కొధర కమ్మిన యున్నయి. తక్క ధర కమ్మినయున్నయి. " అన్నాడు గంగయ్య.

"ఇగగిట్ల మాట్లాడుకుంట వోతే రాత్రయినా పంచాయితి తెగది. అసలు సంగతి వదిలిపెట్టి ఒగలనొగలు కొల్సుకునుడేంది? మహేందర్ ! మీ తమ్ముల మాటలు విన్నవు కదా! నీకున్న మంచితనం వాళ్లకు లేదు. ఏం జేత్తవో జెప్పు?" అన్నాడు సర్పంచ్.

ఇక నాకు మాట్లాడక తప్పలేదు." నర్సయ్యా! నా జీవితంలో నేనబద్ధమాడింది లేదు. నేను నీకు చేను అమ్ముతానని చెప్పలేదు. నేనున్న చోటుకొచ్చి బయానా పెట్టావు. వాళ్లేమో మొత్తం కావాలని నన్ను ఇరికించారు. ఆ రోజు నీకొరకు మనిషిని తోలితే లేవు. పెద్దమనుషులను, నా ఊరి వాళ్లను, నా వాళ్లని నమ్మి ఆ భూమిని వాళ్లకిస్తానని ఒప్పుకున్నాను. ఈ భూమిని వదిలిపెట్టు. నువ్వు రొన్నెల్లయింది కదా డబ్బిచ్చి! నీ డబ్బు నీకు వడ్డీతోసహా కలిపి ఇచ్చేస్తా. నా మంచితన్నాన్నో , నామీద గౌరవంతోనో నువ్వు దేనికొప్పుకున్నా మంచిదే!" అన్నాను ప్రాధేయపూర్వకంగా.

నా మాటలు విని నర్సయ్య ముఖం ముడుచుకున్నాడు. కొద్ది క్షణాలాగి ఖచ్చితంగా అన్నాడు. " నువ్వు చదువుకున్నోనివి. మేం మోటుగాల్లం. మా తోని చెప్పించుకుంటవా? ఆ పదిహేను కుంటలకు బయానా పెట్టిన. ఆ భూమి నాదే! వాయిదా ప్రకారం నేను మిగతా డబ్బులు కడాతా. నేను రొండువేలు బయానిచ్చెపటికె ఇంక రొండు వేలు కలిపిస్తనంటున్నవు. అప్పుడే పదివేలిస్తే పదివేలు కలిపిచ్చేటోనివా? నువ్వు రొండువేలు కాదు ..ఎంతిచ్చినా నాకద్దు . మనిషన్నాక ఒక్క మాట మీద నిలబడాలె. నా దగ్గర బయాన తీసుకొని ఆల్ల దగ్గరెందుకు తీసుకున్నవు? బయానిస్తే కొన్నట్టే లెక్క. ఆ భూమి నిడువ. ఆరునూరయిన మంచిదే! ఆ భూమిలకు కొంరయ్య కొడుకు లెట్లస్తరో నేం జూత్త.."

నర్సయ్య నుండి నేనా మాటలూహించలేదు. ఓదిక్కు నర్సయ్య, మరో దిక్కు మా చిన్నమ్మ కొడుకులు నన్ను దోషిని చేసి మాట్లాడుతున్నారు. ఎవరూ తగ్గడానికి సిద్ధంగా లేరు. తమ పట్టుమీదనే ఉన్న ఇరు పక్షాల వారిని చూస్తుంటే నాకు విపరీతమైన ఆగ్రహం వచ్చింది. పైగా నన్ను మాటతప్పుతున్నానని బదునాం చేస్తున్నారు.

" మీరేమో పెద్దసత్య హరిశ్చంద్రులు . లేదా ఆయన కన్నగారో తమ్ముళ్లో.. నేనేమో మాటతప్పేవాన్ని ,అంతేనా ? నేను పిచ్చివాన్నయి మీరంతా నా వాళ్లని మిమ్మల్ని నమ్మాను. ఓ దిక్కు పొరపాటు జరిగిందని ఒప్పుకుంటుంటే ఎందు కిలా పట్టుపట్టి కూర్చుంటారు? ఒక్కరైనా ఎందుకు దిగిరారు? నేను నా భూమిని ఎవ్వరికీ అమ్మను. దాన్నెవరూ దున్నవద్దు. అలాగే బీడుగానే ఉండనియ్యండి. ఇద్దరి పైసలు మీవి మీకు పారేస్తాను . తీసుకోండి. నా భూమి నాకే కావాలి. " అన్నాను కోపంగా. లేచి చిర్రుబుర్రులాడుతూ అటూ ఇటూ తిరగసాగాను. సాధారణంగా ఎవరి మీదా కోపం కనబరచని నేను కోపానికి రావడంచూసి కొంతైనా దిగివస్తారనుకున్నాను. కాని అదీ జరుగలేదు.

"అమ్ముతానని ఇద్దరి దగ్గర బయానా తీసుకోని ఇప్పుడు డబ్బులు వాపసు ఇస్తానంటే ఎవరూర్కుంటారు? ఇద్దరికీ తీసుకున్న దానికి రెట్టింపు డబ్బు లిచ్చి రాసిచ్చిన కాగితాలను చింపెయ్యండ్రి. " అన్నాడు ఉపసర్పంచ్ .

అవును...అవును అన్నారంతా. ఇద్దరికీ రెట్టింపిస్తే ఒప్పుకుంటామన్నారువాళ్లు.

అంటూ ఉత్తపుణ్యానికి పన్నెండువేల రూపాయలు చెల్లించాలన్నమాట! అది నాలాంటి మధ్యతరగతికి కూడా ఎదగని ఉద్యోగికి భారమే! బయానా తీసుకున్న ఖర్మానికి అంత డబ్బు నష్టపోవడం , అదీదండుగ రూపంలో కట్టాడని నింద భరించడం ...ఏం చెయ్యాలా అని నేను ఆలోచిస్తున్నాను.

"మహేందర్ ! నీ కింత వరకు ఒక్క మచ్చకూడా లేదు. ఇప్పుడిలా చేస్తే దండుగ కట్టావన్న అపకీర్తి వస్తుంది. రెట్టింపు డబ్బు కట్టి భూమినుంచుకున్న వాడిగా పాడుపేరొస్తుంది. మాట కోసం ఎన్నో వదిలిపెట్టుకున్న నీకు ఇలా జరగడం బాగుండదే. పన్నెండు వేలు నష్టపోయి ఊంళ్లో చెడ్డపేరు తెచ్చుకునేకంటే ఎవరో ఒకర్ని ఇంకే విధంగానైనా ఒప్పిస్తే మంచిది. అలా చేయకుంటే ఆ తర్వాత భూమిని అమ్మడం కూడా కష్టమవుతుంది. బాగా ఆలోచించు." అన్నాడు సునీల్ .

నాకిది ఊహించని ఎదురు దెబ్బ. నేనేం మాట్లాడలేక పోయాను.

"మహేందర్ మాట్లాడవేంటి? ఇద్దరూ భూమిని వదులు కోవడానికి సిద్ధంగా లేరు. ఏం చెయ్యాలో చెప్పు" అన్నాడు రాజిరెడ్డి.

సునీల్ నన్ను పక్కకు తీసుకుని వెళ్లాడు. నాకో ఉపాయం చెప్పాడు. నాకది సబబుగానే తోచింది. చాలా సేపు తర్జనభర్జనలయ్యాయి. నాకివ్వాల్సిన డబ్బులోంచి కొంత తక్కువచేస్తే తానా భూమిని

నర్సయ్య కొదిలి మిగతా భూమిని తీసుకుంటానన్నాడు కొంరయ్య. నాకు కొంత నష్టమైనా సమస్య ఇలా పరిష్కారం కావడం నాకు కొంత ఊరట నిచ్చింది. ఈ విధంగానే కాగితాలవీ రాసుకుని సంతకాలు పెట్టాము.

ఆ భూమి కోసం ఇంత తతంగం జరగడం ఒకెత్తయితే అక్కన్నుంచి వెళ్లిపోతూ మాచిన్నమ్మ కొడుకులు తమస్నేహితులతో అన్న మాటలు ఒకెత్తయినాయి. నేను వినడం లేదదనుకొని వాళ్లన్న మాటలు నన్నుతీవ్ర ఆవేదనకు గురి చేసాయి.

''నర్సయ్య ప్రాణం పోయినా భూమినొదిలిపెట్టడని మాకు తెలుసు. అయినా మొత్తం భూమికి ధర చెయ్యాలని మా అన్న నిందులో ఇరికించాం . మేం గట్టిగా బిగబడితే నర్సయ్య కిచ్చిన భూమి మాకు రాకున్నా మాకిచ్చిన భూమి ధర కొంతైనా తగ్గుతుందని ఇట్ల చేసినం. మా అన్న అమాయకుడు కదా! బోల్తా పడ్డాడు.''

ఆ మాటలు సునీల్ విన్నాడు. "తెల్సిందా నీ పల్లెవాళ్ల సంగతి. వాళ్లెంత అమాయకులో ఇప్పటికైనా అర్థమైందా? ''అన్నాడు సునీల్. మా తమ్ముల మాటలు నాకు షాక్ ట్రీట్‌మెంట్ లాంటివే! సమస్య పరిష్కారమైనా ఆ మాటలు నన్ను చాలా బాధించాయి.

ఆరోజు సాయంత్రం ఊర్నుంచి వెళ్లిపోయాము. గాయపడున్న నన్ను సునీల్ ఏమీ ప్రశ్నించలేదు. "సర్వ సంపదలకు సృష్టికర్తలైన గ్రామీణుల్లో వ్యాపార నాగరికత పెరుగుతోందా? ఇదువరకున్న ఆ ప్రేమలు, ఆప్యాయతలు నశిస్తున్నాయా? డబ్బు చుట్టే తిరుగుతున్నాయా?'

నాలో రకరకాల ప్రశ్నలు... భూమి డబ్బు పూర్తిగా ముట్టడం, రిజిస్ట్రేషన్ పనులన్నీ పూర్తికావడానికి రెండుమూడు నెలలు పట్టింది. ఈ రెండు మూడునెలలు ఊరికి తరుచుగా పోయాను . ఊరికెళ్లినప్పుడల్లా ఒక్కోసారి ఒక్కోవాడకు తిరుగుతూ ఇంటింటికి వెళ్లి గ్రామీణులతో మాట్లాడాను. వాళ్ల కష్టసుఖాలను తెలుసుకున్నాను. వాళ్లు చేస్తున్న పనులను గమనించాను. నా ప్రశ్నలకు సమాధానాలకోసం వెతికాను.

✸ ✸ ✸

"ఊళ్లమీద నీకున్న అభిప్రాయాలు ఇప్పటికైనా మారాయా?''

" సునీల్ ! నేనోడిపోయానని చెబితే నేనేదో కోల్పోతాననుకోను. ఇందులో ఒకరు ఓడిపోవడం, ఒకరు గెలవడం అనే మాటే లేదు. కాలానుగుణంగా ఎంతో కొంత మార్పు రావడం అత్యంత సహజం. అంత మాత్రాన పల్లెవాళ్లు అన్నిటికీ దూరమై మారిపోయారనటం సరైంది కాదు. ఇక కొంరయ్య, నర్సయ్య వాళ్ల ప్రవర్తనకు గల కారణమంటావా? బాగా ఆలోచిస్తే నాకవి అసహజమని పించడం లేదు. భూమ్మీద వాళ్లకుండే ప్రేమే , ఆ భూమిని తామే దక్కించు కోవాలన్న తాపత్రయమే వాళ్ల పట్టుదలలకు కారణం. మా చిన్నమ్మ కొడుకుల దురుసు ప్రవర్తనకు కారణం వాళ్ల తరంలోని ఆవేశం.. దుడుకుతనం..

ఎవరెన్ని చెప్పినా ఇలాంటి పంచాయితీ మనలాంటి వాళ్లలోనయితే నేను పన్నెండువేలూ కట్టాల్సి వచ్చేది. అల్పసంతోషులు వాళ్లు . ఒకటి రెండు వేలతో సంతృప్తి పడ్డారు. నీ నమ్మకాల మాటెలా ఉన్నా ఆ విషయంలో నేను చేసింది తప్పుకాదా? ఎంత రెక్కలుముక్కలు చేసుకున్నా ఎముకలే మిగుల్చుకున్న కొంరయ్య లాంటి వాళ్లు ఈ అవకాశాన్ని చూసుకుని రెండువేలు సంపాదించు కోవాలనుకోవడంలో తప్పేముంది?' ' అన్నాను .

నా విశ్లేషణకు నోరు తెరిచి చూస్తున్నాడు సునీల్ . కొద్దిసేవతనికేం మాట్లాడాలో తెలియలేదు.

''అంటే? ఊళ్లిప్పుడు ఊళ్లుగానే ఉన్నాయంటావు. పెద్దగా మార్పురా లేదంటావు. ఇప్పుడెవరు వ్యవసాయం చేస్తున్నారు? తెలిసే ఎందుకలా గుడ్డిగా సమర్థిస్తావు? '' అన్నాడు సునీల్

"నేను దేన్నీ గుడ్డిగా సమర్థించడంలేదు. కాని ఇప్పటికీ ఎప్పటికైన ఆ సృష్టికర్తల చిరునామాలు ఊళ్లేనంటాను. నేను గడపగడపా తిరిగి చూసాను. ఎన్నో గమనించాను.

''ప్రతి కులం నుంచీ చదువుకొని ఉద్యోగాలొచ్చి కొందరు, ఇతర విధాలుగా కొందరు వలసలు పోయుండవచ్చు. అయినా ఇదివరకటంత కాకున్నా ఇప్పుడు కూడా వ్యవసాయాలు చేసేవాళ్లు చేస్తున్నారు. బట్టలమ్మే వాళ్లు చేస్తూనే ఉన్నారు. ఇతర ఉత్పత్తి సంబంధమైన పనులు చేసేవాళ్లు చేస్తూన్నారు. అయితే ఖచ్చి తంగా తమ కులవృత్తులతోనే బతుకుతుండటం లేకపోవచ్చు. కాని సహస్ర వృత్తుల వాళ్లూ వాళ్ల ఉత్పత్తులను సాగిస్తూ ఊళ్లలో ఉన్నారు. వాళ్లే మన సంస్కృతిని, భాషను కాపాడుతున్నారు.

"ఇప్పుడు సమాజంలో సంక్లిష్ట పరిస్థితులున్న మాట నిజమే! చాలా మంది ఊళ్లొదిలి పోతున్నట్టె కనబడ్తున్న మాటా నిజమే! కానీ దుర్మార్గంగా పెరుగుతున్న పట్టణాలు ఎంతమందికని ఉపాధి చూపగలవు? ఎన్ని వనరులు తగ్గినా భూమయితే తగ్గేది కాదుగదా! ఎన్ని పారిశ్రామికోత్పత్తులు, బంగారం, సంపదలున్నా ఆహారోత్పత్తులు లేనిదే బతకడం సాధ్యం కాదు కదా! అందుకే ఎప్పటికైనా గ్రామాల దిక్కు దృష్టి మరల్చక తప్పదు. ఇంజనీరింగ్ చదివీ బతకడానికి వ్యవసాయాన్ని ఎన్నుకోవలసి రావచ్చు. అందుకే సృష్టి కర్తల శాశ్వత చిరునామా గ్రామమే! మనది వ్యవసాయిక ప్రధానమైన దేశమన్నది మరిచిపోవద్దు .''

నా మాటల గూర్చి ఆలోచిస్తూ న్నాడు సునీల్.

Ⓟ

